www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -308 శుక్రవారం13 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## మూసీ ప్రాజెక్టుకు 100 ఎకరాలు

# బదలాయించండి

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి

**హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్టులకు 500 ఎకరాలు కేటాయిస్తాం -అంతర్జాతీయస్థాయిలో మామునూరు ఎయిర్‌పోర్ట్ కట్టండి**

**మంత్రులు అశ్వినీ వైష్ణవ్, రామ్మోహన్ నాయుడుకు వినతి**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 12ప్రజావినికిడి,**

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు 100 ఎకరాలు బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో రెండో రోజు ఆయన పలువురు కేంద్రమంత్రులను కలిశారు. తొలుత రాజ్‌నాథ్ సింగ్‌తో సౌత్ బ్లాక్‌లోని ఆయన కార్యాలయంలో భేటీ అయ్యి మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు గురించి వివరించారు. ఈసా.. మూసీ నదుల సంగమస్థలిలో.. 1948లో మహాత్ముడి చితాభస్మాన్ని నిమజ్జనం చేసిన బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు శంకుస్థాపన, మిగతా 2లో...

# శ్రామిక జనగర్జన

## కదం తొక్కిన కార్మిక లోకం

**సార్వత్రిక సమ్మె సక్సెస్ -బీజేపీ వ్యతిరేక నినాదాలతో హోరెత్తిన ప్రదర్శన**

**నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాల్సిందే.. లేకుంటే పోరాటం ఉధృతం చేస్తాంకార్మిక సంఘాల నేతలు**



హైదరాబాద్ **ఫిబ్రవరి 12ప్రజావినికిడి,**

మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ గురువారం కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సక్సెస్ అయింది. హైదరాబాద్‌లో జరిగిన ఆందోళనా కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ, బీఆర్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఏఐయూటీయూసీ అనుబంధ సంఘాల నుంచి వేలాదిమంది కార్మికులు, రోడ్లపైకి వచ్చి మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలంటూ కదం తొక్కారు. స్థానిక ఆర్టీసీ కళ్యాణ మండపం నుంచి ప్రారంభమైన కార్మిక, కర్షక, ప్రజా ప్రదర్శన ఆర్టీసీ క్రాస్ రోడ్స్, అశోక్‌నగర్ చౌరస్తా మీదుగా ఇందిరా పార్కు వరకు కొనసాగింది.మిగతా 2లో...

## 114 రఫేల్ యుద్ధ విమానాలు, 6 పీ8ఐ విమానాలకు

## కేంద్రం గ్రీన్‌సిగ్నల్




న్యూఢిల్లీ: ఫ్రాన్స్ నుంచి 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన కీలకమైన డిఫెన్స్ డీల్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.3.25 లక్షల కోట్ల విలువైన డీల్ ఇది. ఈ డీల్‌కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని డిఫెన్స్ కౌన్సిల్ ఆమోదం తెలిపినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత నావికా దళం కోసం 6 పీ8ఐ (ఫ్రా8ఐ) విమానాలను కొనుగోలు చేసే డీల్‌ను కూడా ఆమోదించినట్టు తెలిపాయి.మిగతా 2లో...

# ఉద్యోగాలొస్తాయ్

## తక్కువధరకు భూములిస్తే తప్పేంటి

**ఇందులో లాలూచీ ఏమీ లేదు: మంత్రి లోకేశ్**

**ఆరోపణలు నిరూపించాలని వైసీపీకి సవాల్**

**మండలిలో అధికార, విపక్షాల మాటల యుద్ధం**

అమరావతి,. **ఫిబ్రవరి 12ప్రజావినికిడి,**

శాసన మండలిలో గురువారం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడిచింది. పరిశ్రమలకు భూముల కేటాయింపులు, పింఛన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలపై సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రులు, విపక్ష సభ్యుల సవాళ్లు, ప్రతి సవాళ్లతో మండలి హోరెత్తింది. తొలుత 99 పైసలకే భూ కేటాయింపుల అంశంపై వాడీవేడీ



చర్చ జరిగింది. ఎకరా 99 పైసలకే ఏ పరిశ్రమకు, ఎంతెంత భూమి కేటాయించారు? పరిశ్రమలతో ప్రభుత్వ ఒప్పందాలు ఏంటని వైసీపీ సభ్యులు మాధవరావు, కళ్యాణి, రవీంద్రబాబు ప్రశ్నించారు. మంత్రి లోకేశ్ సమాధానం చెప్తూ.. యువతకు ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో టీసీఎస్, కాగ్నిజెంట్, ఏఎన్‌ఎస్‌ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకే ఎకరా 99 పైసలకు భూములు కేటాయించామని, దీని వల్ల ఐటీ రంగంలో 65 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని, ప్రత్యక్షంగా, పరోక్షంగామిగతా 2లో...

## ఉద్యోగులకు ఆరోగ్యమస్తు

**త్వరలోనే 1,056 కోట్లతో బీమా పథకం.. ప్రభుత్వం, ఉద్యోగుల చెరి సగం వాటా**

**సిబ్బంది మూల వేతనం నుంచు? 1.5 కట్**

**'ఉద్యోగుల హెల్త్ కేర్ ట్రస్టు' ద్వారా సేవలు**

**15 రోజుల్లో పథకం ప్రారంభానికి చర్యలు**



# నేడు కౌంటింగ్

**ఉదయం 8 గంటల నుంచిమున్సిపోల్స్ ఓట్ల లెక్కింపు**

**రాష్ట్రవ్యాప్తంగా 123 కేంద్రాల ఏర్పాటు -రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడి**




హైదరాబాద్ **ఫిబ్రవరి 12ప్రజావినికిడి,**

రాష్ట్రవ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లోని 2,996 వార్డుల ఓట్ల లెక్కింపుకు ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానున్న లెక్కింపు కోసం 123 కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపు 10 వేల మంది సిబ్బంది లెక్కింపులో పాల్గొంటారు. మున్సిపాల్టీ, కార్పొరేషన్లలోని వార్డుల సంఖ్య ఆధారంగా 15 నుంచి 35 వరకు టేబుళ్లను ఏర్పాటు చేశారు. ప్రతి టేబుల్‌పై జరుగుతున్న లెక్కింపు ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారామిగతా 2లో...

## తెలంగాణ పంచాయతీలకు

# రూ.387 కోట్లు

**వారం క్రితం తొలి విడతలో రూ.259.63 కోట్లు విడుదల**

**రెండు విడతల్లో కలిపి రూ.646.46 కోట్ల నిధులు విడుదల**

**పెండింగ్‌లో ఉన్న మరో రూ.2,400 కోట్ల నిధులు**



## నా గొంతు నొక్కేందుకే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు

**అసెంబ్లీలో మాట్లాడే చాన్స్ లేనందునే మీడియాతో మాట్లాడుతున్నా: జగన్**

**'కల్తీ నెయ్యి'తో వైసీపీకి సంబంధం లేదంటూ అవే అబద్ధాలు**

**అమరావతి,ఫిబ్రవరి 12ప్రజావినికిడి,**

అసెంబ్లీలో తన గొంతు నొక్కేందుకే ప్రధాన ప్రతిపక్షనేత హోదా ఇవ్వడంలేదని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. సభలో ఏకైక ప్రతిపక్ష పార్టీ వైసీపీ అయినా ప్రభుత్వం గుర్తించడంలేదన్నారు. గురువారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైసీపీఎల్పీ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో సీఎం చంద్రబాబుతో సమానంగా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశపూర్వకంగా తనకు హోదా ఇవ్వడం లేదని అన్నారు. బడ్జెట్‌పై అసెంబ్లీ సమావేశాల్లో ప్రజాగొంతుకై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకూడదనేమిగతా 2లో...



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# మూసీ ప్రాజెక్టుకు 100 ఎకరాలు బదలాయించండి

(మొదటి పేజి తరువాయి)

భూమి పూజ కార్యక్రమానికి హాజరుకావాలని రక్షణమంత్రిని ఆహ్వానించారు. రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కలిసి.. కృష్ణా-వికారాబాద్ రైలు మార్గాన్ని పూర్తిగా కేంద్ర నిధులతో చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ వ్యయం మొత్తాన్నీ తామే భరిస్తామని ఇప్పటికే తెలియజేసిన విషయాన్ని సీఎం కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. రైలు మార్గంలోని టేకల్‌కోడ్‌లో లైమ్ స్టోన్ నిక్షేపాలను గుర్తించామని.. సిమెంట్, జౌళి పరిశ్రమల కేంద్రంగా దానిని అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉన్నామని తెలిపారు. కొడంగల్, టేకల్‌కోడ్, దౌల్తాబాద్‌లను పారిశ్రామిక జోన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం వివరించారు. అలాగే.. హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూర్, హైదరాబాద్-పుణే హైస్పీడ్ రైలు కారిడార్లకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ సమీపంలో 500 ఎకరాల స్థలం కేటాయిస్తామని రైల్వే మంత్రికి సీఎం తెలియజేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న శంషాబాద్ నుంచే హైస్పీడ్ రైలు మార్గాలని ప్రారంభించాలని కోరారు. హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ కారిడార్ అమరావతి మీదుగా వెళుతుందని, అక్కడి నుంచి బందరు పోర్టుకు రైలు మార్గం మంజూరు చేయాలని విన్నవించారు. దాంతో డ్రైపోర్ట్ నుంచి బందరు పోర్టుకు సరకు రవాణా వేగవంతం అవుతుందని తెలియజేశారు. హైదరాబాద్ - బెంగళూరు, హైదరాబాద్ - పుణే హైస్పీడ్ కారిడార్లు శంషాబాద్ నుంచే మొదలు పెడితే అది ట్రై జంక్షన్‌అవుతుందని వివరించారు. ఈ మూడు కారిడార్లకూ వెంటనే భూసేకరణ చేసి, పనులు ప్రారంభించాలని కేంద్రమంత్రిని కోరారు. సీఎం విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఇక.. పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడును కలిసి.. తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్‌కు సమీపంలో నిర్మించనున్న మామునూరు ఎయిర్‌పోర్ట్ పనులు వెంటనే చేపట్టి, అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఆ విమానాశ్రయంలో కార్గో సేవలతోపాటు మెయింటెనెన్స్.. ఓవర్ హాల్ రిపేర్ (ఎంవోఆర్) సదుపాయాలు ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. దాని ఏర్పాటుకు అదనంగా అవసరమైన 249.82 ఎకరాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సీఎం విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన రామ్మోహన్ నాయుడు.. విమానాశ్రయ పనుల ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను పంపిస్తానని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయి ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలు సాధించడంపై రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ సీఎం రేవంత్‌ను అభినందించారు.

# ఉద్యోగాలొస్తాయ్

(మొదటి పేజి తరువాయి)

4-5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. విశ్వసనీయత ఉన్న కంపెనీలకే భూములిచ్చామని, ఇందులో లాలూచీ ఏమీ లేదని స్పష్టం చేశారు. 'నన్ను విమర్శించాలనుకుంటే విమర్శించండి.. కప్పు కాఫీ, టీ తప్ప ఆయా కంపెనీల నుంచి నేనేమైనా తీసుకుంటే నిరూపించండి. విశ్వసనీయత లేని కంపెనీలకు తక్కువ ధరకు భూములిచ్చామని నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం' అని సవాల్ చేశారు.

పక్క రాష్ట్రాలతో పోటీ పడాల్సిన అవసరం ఉంది కాబట్టే.. తక్కువ ధరకు భూములిచ్చామని లోకేశ్ స్పష్టం చేశారు. ఏపీఐఐసీని కాదని రియల్ ఎస్టేట్ సంస్థలకు భూములెందుకు ఇస్తున్నారని విపక్ష నేత బొత్స ప్రశ్నించగా, టాటా నానో ఫ్యాక్టరీని బెంగాల్‌లో తరిమేయడంతో నాటి గుజరాత్ సీఎంగా ఉన్న మోదీ 99 పైసలకే భూమి ఇస్తామని తమ రాష్ట్రానికి తీసుకెళ్లారని, దీంతో అక్కడ ఎకో సిస్టమ్ ఏర్పడిందన్నారు. ఇప్పుడు విశాఖనూ ఐటీ కేంద్రంగా మారుస్తున్నామన్నారు. భూ కేటాయింపుపై వైసీపీ పిల్ వేయించగా, కోర్టు మొట్టికాయలు వేసిన విషయాన్ని లోకేశ్ గుర్తుచేశారు.

మంత్రి అచ్చెన్నాయుడు కల్పించుకొని.. మంచి కంపెనీలకే తక్కువ ధరకు భూములిస్తున్నామని, తమ కుటుంబసభ్యులకు ఇవ్వట్లేదని వ్యాఖ్యానించారు. భూకేటాయింపులపై వాదోపవాదాల నేపథ్యంలో వైసీపీ సభ్యులు మండలి నుంచి వాకౌట్ చేశారు. మంత్రి లోకేశ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. వైసీపీ సభ్యులు ఎందుకు వాకౌట్ చేశారో అర్థం కావడం లేదన్నారు. 'బొత్సకు ఇదో ఫ్యాషన్. ఆ తలుపు నుంచి వస్తారు. ఈ తలుపు నుంచి వెళ్తారు' అని అన్నారు. మా ప్రభుత్వ లక్ష్యం కోసం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కియ పరిశ్రమ రాకతో ఆ ప్రాంతం మారిందన్నారు. క్లస్టర్ విధానంతో ముందుకు వెళు_తున్నామని, ముందుకొచ్చిన ప్రతి పరిశ్రమ గ్రౌండింగ్ చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు.

పైసలకే భూమి ఇస్తారా? అని వైసీపీ సభ్యులు ప్రశ్నించారు. దీనిపై లోకేష్ దీటుగా స్పందించారు. 5 కంపెనీలకే భూములు ఇచ్చామని, ఆరో కంపెనీ పేరు ప్రస్తావిస్తున్నందున, ఆధారాలు చూపాలని సవాల్ చేశారు. ఉర్సా కంపెనీకి భూమి కేటాయించలేదని స్పష్టం చేశారు. అయినా వైసీపీ సభ్యులు కేకలు పెడుతుండటంతో.. 'లెక్కల్లోకి వెళ్తే.. 151 కాస్తా.. 11 అయ్యాయి. దీనిపైనా చర్చిద్దామా?' అని అన్నారు. ఏపీకి పరిశ్రమలు రాకూడదని, పరిశ్రమల్ని తరిమేయాలని వైసీపీ లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు.

కూటమి ప్రభుత్వం భారీగా పింఛన్లు తొలగించిందని, కొత్త పింఛన్లు ఇవ్వలేదని వైసీపీ ఎమ్మెల్సీలు ఆరోపించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో 10 లక్షల పింఛన్లు తొలగించారని, అనర్హులకు అక్రమంగా పింఛన్లు ఇచ్చారని విమర్శించారు. తమ 20 నెలల పాలనలో ఎవరి పింఛనూ తీసేయలేదని స్పష్టం చేశారు. దివ్యాంగుల సర్టిఫికెట్ల రీవెరికేషన్ చేసి, పింఛన్ కొనసాగిస్తున్నామన్నారు. కొత్తగా 2.50 లక్షల స్పౌజ్ పింఛన్లు ఇచ్చామన్నారు. 2019-24 మధ్య పింఛన్లకు రూ.91 వేల కోట్లు ఖర్చు చేయగా, తమ ప్రభుత్వం 20 నెలల్లో రూ.55 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. గతంలో టీడీపీ ప్రభుత్వం 54.10 లక్షల పింఛన్లు ఇస్తే, వైసీపీ ప్రభుత్వం పార్టీ ముద్ర వేసి, లక్షల పింఛన్లు నిలిపివేసిందన్నారు.

### బొత్స వర్సెస్ మంత్రి పార్థసారథి

'తల్లికి వందనం' కింద ఎంత మంది పిల్లలున్నా ఏటా ఒకొక్కరికి రూ.15 వేలు వేస్తామని మోసం చేశారని, 15 శాతం మందికి రూ.7-8 వేలు మించి పడలేదని బొత్స ఆరోపించారు. నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని మంత్రి పార్థసారథి సవాల్ చేశారు. 48 లక్షల మందికి 'అన్నదాత సుఖీభవ' లబ్ధి చేకూరితే.. ఏ రైతుకూ రూ.20 వేలు పడలేదనడం సరికాదన్నారు. సాంకేతిక కారణంతో ఎక్కడో కొద్ది మందికి అలా జరిగి ఉండొచ్చని, అలాంటి వారి వివరాలు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వంలో 'అమ్మ ఒడి'ని ఇద్దరికీ ఇస్తామని మాట తప్పారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలుంటే అంత మందికి రూ.15 వేలు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు ఇస్తున్నామని చెప్పారు. మరోవైపు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరు మాత్రమే మార్చినట్లు వైసీపీ సభ్యులు తప్పుగా చెప్తున్నారని, యాక్ట్‌ను పూర్తిగా రద్దు చేశామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు.

**ఉయ్యాలవాడ, బుడ్డాను గౌరవించేలా: దుర్గేశ్**

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి స్మారక మ్యూజియాల ఏర్పాటుపై టీడీపీ సభ్యులు రాంగోపాల్‌రెడ్డి, బీటీ నాయుడు, బీద రవిచంద్ర వేసిన ప్రశ్నకు పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ సమాధానం చెప్పారు. స్వాతంత్ర్య సమరంలో వీరోచితంగా పోరాడిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, కరువు సమయంలో పేద ప్రజలకు యావదాస్తి దానం చేసిన బుడ్డా వెంగళరెడ్డి పేరిట స్మారకాల ఏర్పాటుపై పరిశీలిస్తామని చెప్పారు. వారిద్దరి జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు.

**ప్రభుత్వం సరైన సమాధానం చెప్పలేదు: బొత్స**

అసెంబ్లీ బయట బొత్స మీడియాతో మాట్లాడుతూ.. 99 పైసలకు ఇష్టారాజ్యంగా భూములు ఇవ్వడంపై ప్రశ్నించామని, ప్రభుత్వం సరైన సమాధానం చెప్పలేదన్నారు. అందుకే వాకౌట్ చేశామని పేర్కొన్నారు. స్వయానా సీఎం కుటుంబసభ్యులు రూ.5 వేల కోట్ల విలువైన భూములు సొంతం చేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

# శ్రామిక జనగర్జన

(మొదటి పేజి తరువాయి)

అనంతరం అక్కడ జరిగిన సభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడగు భాస్కర్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు, ఐఎన్‌టీయూసీ నాయకులు చంద్రశేఖర్, హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రెబ్బరామారావు, టీయూసీఐ ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎల్ పద్మ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, బీఆర్‌టీయూ కార్యదర్శి మారయ్య, ఏఐయూటీయూసీ నాయకులు భరత్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, ఏఐకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, అఖిల భారత ఐక్య రైతు సంఘం కార్యదర్శి ప్రభాకర్, సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ జక్కుల వెంకటయ్య, ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తదితరులు మాట్లాడారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్పొరేట్లు. అదానీ, అంబానీలతో పాటు మతోన్మాదుల ప్రయోజనాలకోసం కార్మికులు, కర్షకులపై యుద్ధం ప్రకటించిందని నాయకులు చెప్పారు. కార్మికుల ప్రయోజనాల కోసమే నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చినట్టు పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కోడ్‌లతో కార్మిక హక్కులను పారిశ్రామిక యజమానుల కోసం పణంగా పెట్టారని విమర్శించారు. ఇప్పటికే కార్మికులకు కనీస వేతనం అమలు కావటం లేదనీ, దీంతో వారి జీవనం దుర్భరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గోరుచుట్టుపై రోకటిపోటులాగా ఉన్న హక్కులను ఊడపెరికితే..ఇక



కార్మికుడి బతుకు పెనం నుంచి పొయిలో పడిన చందంగా మారక తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులకు బీజేపీ ప్రభుత్వం సమాధి కడుతుంటే, బీఎంఎస్ దానికి అనుగుణంగా వ్యవహరిస్తున్నదని ఎద్దేవా చేశారు.

సార్వత్రిక సమ్మె కార్మికుల జీతాల కోసమో, సంక్షేమం కోసమో కాదనీ, దేశ ప్రయోజనాల కోసం జరుగుతున్నదని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె సక్సెస్ అయిందనీ, అన్ని వర్గాల కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. ఎక్కడికక్కడ తమ నిరసనను తెలిపారన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయబోమంటూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో చర్చించకుండానే కార్మిక చట్టాలను రద్దు చేయటమేంటని ప్రశ్నించారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేంత వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. రైతు సంఘాలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోడీ ప్రభుత్వం రైతాంగాన్ని మరో సారి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నా గొంతు నొక్కేందుకే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు

వైసీపీని ప్రతిపక్షంగా గుర్తించలేదని ఆరోపించారు. అసెంబ్లీలో వైసీపీకి బలం తక్కువని, పార్టీ గొంతు వినపడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని తెలిపారు. శాసనసభలో గొంతెత్తి మాట్లాడే అవకాశం లేనందునే మీడియాతో బయట మాట్లాడుతున్నామని అన్నారు. శాసనమండలిలో బలం ఉన్నందున అక్కడ ప్రజా సమస్యలపై గట్టిగా పోరాడుదామని, ఎమ్మెల్సీలు సభలో గట్టిగా మాట్లాడాలని సూచించారు. కల్తీ నెయ్యి సరఫరాతో వైసీపీకి ఏమాత్రం సంబంధం లేదని, తమ ప్రభుత్వ హయాంలో జరగలేదని, సీబీఐ చార్జిషీట్‌లోనూ ఇదే ఉందన్నారు. సీబీఐ చార్జిషీట్‌కు చంద్రబాబు సమాధానం చెప్పాలని, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై ప్రశ్నించడాన్ని చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారని ఆరోపించారు. అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు, విడదల రజని, బొల్లా బ్రహ్మనాయుడు, భూమన కరుణాకర రెడ్డిపై దాడులు చేశారన్నారు. కాకాణి గోవర్ధనరెడ్డిపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ఇవన్నీ చంద్రబాబు చేయించినవేనని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం స్కామ్‌ల మయమన్నారు.

# నేడు కౌంటింగ్

(మొదటి పేజి తరువాయి)

హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి మానిటరింగ్ చేయనున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. పోటీలో ఉన్న రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్‌లను తెరుస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల వారీగా 25 చొప్పున బెండల్స్ కడతారు. అనంతరం వాటిని లెక్కిస్తారు. తొలి ఫలితం మధ్యాహ్నం 12 గంటల వరకు వస్తుందని భావిస్తున్నారు.

తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ప్రకారం మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికకు గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఫిబ్రవరి 16న సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం అదే రోజు ఎన్నిక నిర్వహిస్తామని పేర్కొంది. ఏదైనా కారణం చేత ఎన్నిక వీలు కాకుంటే మరుసటి రోజు ఫిబ్రవరి 17న నిర్వహించనున్నామని తెలిపింది. నేరుగా ఎన్నికైన సభ్యులతో పాటు ఎక్స్ అఫిషియో మెంబర్లైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎన్నుకోనున్నారని పేర్కొంది. ఎన్నిక జరిగే ప్రాంతంలో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ, వాల్ క్లాక్, పార్టీల వారీగా సీట్ల ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ శాఖను ఆదేశించింది.

## 114 రఫేల్ యుద్ధ విమానాలు, 6 పీ8ఐ విమానాలకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

(మొదటి పేజి తరువాయి)

రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు డీల్‌తో భారత వాయుసేన పోరాట సామర్థ్యం మరింత పెరుగుతుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈనెల ద్వితీయార్థంలో భారత్ పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగానే డిఫెన్స్ డీల్‌పై సంతకాలు జరిగే అవకాశాలున్నాయి. డీల్ ప్రకారం 18 రఫేల్ జట్లను 'ఫ్లై-అవే కండిషన్'లో నేరుగా తీసుకువస్తారు. తక్కిన 96 విమానాలు ఇండియాలో అసెంబుల్ చేస్తారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా స్థానికంగా తయారీ, అసెంబెల్ కోసం రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్, భారత్‌లోని ప్రైవేటు రంగ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంటారు. భారత వాయుసేన వద్ద ప్రస్తుతం 36 రఫేల్ యుద్ధవిమానాలు ఉన్నాయి.

## తెలంగాణ పంచాయతీలకు రూ.387 కోట్లు

**ఫిబ్రవరి 12ప్రజావినికిడి,**

తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం రూ.387 కోట్ల నిధులు విడుదల చేసింది. వారం రోజుల క్రితం తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల చేసింది. తాజాగా మరోసారి విడుదల చేయడంతో రెండు విడతల్లో కలిపి రూ.646.46 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్టయింది. ఈ నిధులతో, గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పనులకు, మౌలిక సదుపాయాల కల్పనకు ఊతం లభించనుంది. కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు మరో రూ.2,400 కోట్ల నిధులు రావాల్సి ఉంది. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా ఉండటానికి పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మంత్రి సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి విడతలుగా నిధులు వస్తున్నాయి.

## సభా హక్కుల తీర్మానం చేసినా వెనక్కి తగ్గను..



న్యూఢిల్లీ: లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా తాను మాట్లాడిన మాటలకు కట్టుబడి ఉంటానని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. తనపై సభా హక్కుల తీర్మానం పెట్టినా వెనుకంజ వేసేది లేదని తేల్చి చెప్పారు. ఈ మేరకు గురువారం నాడు ఒక వీడియోను ఆయన విడుదల చేశారు. తాను నిజమే చెప్పానని, చెబుతూనే ఉంటానని రాహుల్ పేర్కొన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం గురించి రాహుల్ గాంధీ లోక్‌సభలో బుధవారం నాడు జరిగిన బడ్జెట్ చర్చలో తీవ్ర విమర్శలు చేశారు. 'అమెరికాతో ట్రేడ్ డీల్‌లో ఎలాంటి లాజిక్ లేదు. భారత్ ఎలాంటి దామాషా ప్రయోజనాలు పొందకుండానే సాగిలపడింది. ఇరాన్ నుంచో, రష్యా నుంచో, మరో చోట నుంచో చమురు కొనుగోలు చేయాలని అమెరికా ఎలా నిర్ణయిస్తుంది? మీరు భరతమాతను అమ్మేశారు. మీరు సిగ్గుపడాలి. అమెరికా ఒత్తిడితో మోదీ వణికిపోయారు. దేశాన్ని అమ్మేశారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికాకు అప్పగించారు. రైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడ్డారు' అని రాహుల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# ఉద్యోగులకు ఆరోగ్యమస్తు

**త్వరలోనే 1,056 కోట్లతో బీమా పథకం.. ప్రభుత్వం, ఉద్యోగుల చెరి సగం వాటా**
**సిబ్బంది మూల వేతనం నుంచు? 1.5 కట్**
**'ఉద్యోగుల హెల్త్ కేర్ ట్రస్టు' ద్వారా సేవలు -15 రోజుల్లో పథకం ప్రారంభానికి చర్యలు**

హైదరాబాద్,.. **ఫిబ్రవరి 12ప్రజావినికిడి,** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం తీపి కబురు అందించనుంది. ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నూతన ఆరోగ్య పథకాన్ని 15 రోజుల్లో ప్రారంభించాలని సర్కారు నిర్ణయించింది. త్వరలోనే దీనికి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేయనుంది. ఇది అమల్లోకి రాగానే రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు 12,84,532 మందికి వర్తించనుంది. ఈ పథకం కోసం ఉద్యోగులు, పెన్షనర్ల వాటా, ప్రభుత్వ వాటా కలిపి సంవత్సరానికి రూ.1,056 కోట్లు కార్పస్ ఫండ్ జమ కానుంది. ఈ పథకంపై గురువారం సచివాలయంలో సీఎస్ రామకృష్ణారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘాలు, సచివాలయ ఉద్యోగుల సంఘం, తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్, టీఎస్ యూటీఎఫ్, పీఆర్‌టీయూ, తెలంగాణ రిటైర్డ్ అధికారుల సంఘం, తెలంగాణ ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం, తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా 15 రోజుల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సమక్షంలో ఈ పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
శుక్రవారం13 ఫిబ్రవరి 2026

# కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసే వరకు రాజీ లేని పోరాటాలు

## సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి




**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):**
కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక,రైతాంగ, ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేసేంత వరకు రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి స్పష్టంచేశారు. కార్మిక వర్గం దేశ వ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెకు మద్దతుగా సిపిఐ, సిపిఐ(ఎం) సిపిఐ(ఎంఎల్ న్యూడెమోక్ర సీ), సిపిఐ (ఎంఎల్ మ్యాస్లైన్), ఎఐఎఫ్బి, ఎస్యుసిఐ తదితర వామపక్ష పార్టీలు గురువారం నారాయణగూడ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా బిజెపి నేతృత్వంలోని ఎన్డిఎ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తు సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజా వ్యతిరేక నల్లా చట్టాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా గురువారం 10 వామపక్ష పార్టీలు, 10 కేంద్ర కార్మిక సంఘాలు, 500లకు పైగా ప్రజా సంఘాలు సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ సమ్మెలో దాదాపు 30 కోట్ల మంది భాగస్వామ్యమైయ్యరని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనన్నారు. కార్మికులు తమ రక్తాన్ని దారపోసి అనేక త్యాగాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కుదించి కేంద్ర ప్రభుత్వ తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేసేంత వరకు తమ ఉద్యమాలు కొనసాగుతునే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజయ్య నాయక్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు ఎన్.శ్రీకాంత్, వామపక్ష పార్టీలు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెకు మద్దతుగా వామపక్ష విద్యార్థి సంఘాలు




**ప్రజా వినికిడి, (హిమాయత్ నగర్):**
హైదరాబాద్:దేశ వ్యాప్తంగా కార్మిక, కర్షక,కూలీ సంఘాలు ఇచ్చిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. హిమయత్ నగర్ జంక్షన్ లో జరిగిన నిరసన సభలో వామపక్ష విద్యార్థి సంఘాలు నాయకులు మాట్లాడారు. టి.నాగరాజు, ఎస్.రజనీకాంత్(ఎస్ఎఫ్ఐ), పుట్ట లక్ష్మణ్ (ఎఐఎస్ఎఫ్), పొడపంగి నాగరాజు, పి.మహేష్ ( పిడిఎస్యు), ఎస్.అనిల్ (పిడిఎస్యు), నితిష్(ఎఐడిఎస్ఓ),పల్లె మురళీ(ఎఐఎఫ్డిఎస్),గణేష్(పిడిఎస్యు), లు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో 12 యేండ్లు కాలంగా అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ దేశ విద్యా రంగాన్ని కార్పోరేట్, మతోన్మాద విధానాలు అమలు చేస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని కార్పొరేట్,ప్రైవేటు శక్తులకు అప్పజెప్పి విద్యను ప్రభుత్వ విద్యారంగం నుండి తప్పుకుంటుందని తెలిపారు.

# ప్రజల్లో మానసిక పరివర్తన రావాలి



**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):** ప్రజల్లో మానసిక పరివర్తన రావాలని సామాజిక జీవనంలో మానవత్వం, ఐక్యత,విలువల రాహిత్యంతోనే సమాజం నాశనమవుతుందని సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్ సంస్థ ఫౌండర్ చైర్మన్ మస్తాక్ అహ్మద్ అభిలాష్ అభిప్రాయపడ్డారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో సంస్థ డైరెక్టర్ మసూద్ అలీ ఖాన్ తో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 14,15 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన్ భవన్ లో గొప్ప సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సులో వివిధ దేశాల నుంచి 250 మంది డెలిగేట్స్, 400 మంది ముఖ్య కార్యకర్తలు హాజరుకానున్నట్లు వెల్లడించారు.గత ఏడాదికాలంగా విలువల పై అవగాహన కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా స్కూల్స్, కాలేజెస్,యూనివర్సిటీల్లో విద్యార్థులతో ముఖాముఖి అవుతున్నట్లు చెప్పారు.సంస్థ వ్యక్తి నిర్మాణ కేంద్రంగా పనిచేస్తూ సామాజికపరమైన మానసిక,నేర, విలువలపై అవగాహన కోసం పనిచేస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఈ సదస్ కు సిఎస్బి ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ ఎం బాలలత,మాస్టర్ మోటివేటర్ బిఆర్ షఫీ,ఆచార్య ఎం ఏ అభిలాష్ తదితరులు హాజరుకానునట్లు వారు వెల్లడించారు.

# అగ్ని ప్రమాదంపై కంప్లైంట్ ఇచ్చిన ఆప్ కన్వీనర్ హేమ




**ప్రజావినికిడి, (రాజేంద్ర నగర్):** రాజేంద్రనగర్ ఉప్పర్ పల్లి మారుతి షోరూంలో జరిగిన అగ్ని ప్రమాదం ఘటనపై రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్లో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమ సుదర్శన్ జిల్లోజు కంప్లైంట్ ఇచ్చారు. ఫిబ్రవరి 10న మారుతి వర్క్‌షాప్‌లో పెద్ద అగ్నిప్రమాదం జరిగింది. ఈ వర్క్‌షాప్ చుట్టూ 5వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. వర్క్‌షాప్‌ను సందర్శించిన తర్వాత షోరూమ్‌లో కనీస అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు కూడా పాటించడం లేదు. ఈ విషయంపై వెంటనే దృష్టి సారించి పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పడేసిన మారుతి షోరూం సర్వీస్ సెంటర్ నిర్వహణాధికారులపై వెంటనే పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలార్ దేవులపల్లి ఆప్ ఇంచార్జ్ మీర్జా బేగ్,రమ్య గౌడ్, ఇస్రాత్ ఫాతిమా, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను కాలరాసిన మోడీ

## లేబర్ కోడ్‌లపై మండిపడ్డ పిసిసి చీఫ్

హైదరాబాద్,**ఫిబ్రవరి 12ప్రజావినికిడి,** కార్మికుల హక్కులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఆ హక్కు మోదీకి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. కార్మికుల పరిపూర్ణమైన హక్కులను ప్రధాని మోదీ అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారు. కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో, ఆర్టీసీ యూనియన్లు, వివిధ వర్గాల కార్మికులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమెక్రసీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఒక రోజు బంద్‌లో మహేశ్ గౌడ్ పాల్గొన్నారు. వీఎస్టీ నుంచి ఆర్టీసీక్రాస్ రోడ్ మీదుగా ఇందిరాపార్క్ వరకు భారీ ర్యాలీ తీశారు. అనంతరం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్మికుల చెమట కష్టంతో ఈ దేశం నడుస్తోంది. దేశవ్యాప్తంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్ పిలుపుమేరకు కార్మికులు ధర్నా చేస్తున్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం పెట్టుబడి వ్యవస్థకు దారులు తెరిచింది. మోదీ, అమిత్ షాలను కేంద్రంలో రాహుల్ గాంధీ ధైర్యంగా ఎదుర్కొంటున్నారు. పేదల హక్కులను కాలరాయడమే కాకుండా.. నరేగా ఉపాధి హామీకి పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగించారు. కేంద్రం తీసుకువచ్చిన ఆ చట్టాలపై అసెంబ్లీలో చర్చిస్తాం. నాలుగు కోడ్‌ల రద్దు విషయంలో కాంగ్రెస్ పార్టీ కార్మికులకు సంపూర్ణ మద్దతు ఇస్తుంది. కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షపాతి. ప్రధాని మోదీ దిగొచ్చి కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి. అప్పటి వరకు ఈ ఉద్యమం కొనసాగాలి‘ అని మహేశ్ గౌడ్ అన్నారు.


# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
కేంద్ర ప్రభుత్వం విధానాలు ఉపసహరించుకోవాలి ఆర్ కె పూరం లేబర్ అడ్డ దగ్గర భవన నిర్మాణం కార్మికుల తో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమం లోతెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యం గోపి నాయక్ మాట్లాడుతూ,ఈ సమ్మెను విజయ వంతం చేయాలనీ తెలంగాణ గిరిజన సంఘం మద్దతు ఇస్తూ భవన నిర్మాణం కార్మికులకు అడ్డా దగ్గర ఇబంది కరంగా ఉంటుందని బాత్ రూములు లేక మహిళ లు కార్మికులకు ఇబంది కరంగా ఉందని చేపి ఇక్కడ బాత్ రూములు ఏర్పాటు చేయాలని అన్నారు. ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సారత్రిక సమ్మెలో పాల్గొని మాట్లాడుతూ,మోడీ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను 4 లేబర్ కోడ్ అమలుకు వ్యతిరేకంగా పోరాడుదాం. భారత కార్మిక వర్గం ఏన్నో ప్రాణ త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలోని 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్ (2019,2020 సంవలలో) మోడీ ప్రభుత్వం తెచ్చింది. వీటికి వ్యతిరేకంగా భారత కార్మికవర్గం గత 6 సంవరాలుగా చేసిన ఆందోళన పోరాటాల ఫలితంగా ఇంతకాలం వాటిని అమలు చేయకుండా ఆపగలిగాము. బిజెపి ప్రభుత్వం భారత దేశాన్ని కార్మిక సంఘాలు, కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని, పెట్టుబడిదారుల, పారిశ్రామికవేత్తల, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కార్మికుల్ని నిరాయుధులను చేసి కట్టు బానిసలుగా మార్చేందుకు చట్టాలను సులభతరం చేయడం పేరుతో నవంబర్ 21న శ్రమ శక్తి నీతి-2025 పేరుతో కార్మిక విధానాన్ని ప్రకటించి లేబర్ కోడ్స్ అమలుకు నోటిఫికేషన్ జారీ చేసింది.




ఈ విధానంలో ప్రజాస్వామ్య బద్దంగా జరగవలసిన సంప్రదింపుల ప్రక్రియను పక్కకు నెట్టివేసింది. యూనియన్ రిజిస్ట్రేషన్ కష్టతరం చేశారు. సమ్మె చేసే భవిష్యత్లో సాధ్యం కాని పరిస్థితిని సృష్టించారు.లేబర్ అధికారుల తనికి వ్యవస్థను రద్దు చేశారు. ఉపాధి చూపే కార్మిక శాఖను ఉపాధి అవకాశాలు కల్పించే ఏజెన్సిగా మార్చినారు. 8గంటల స్థానంలో 12గంటల పని విధానాన్ని అమల్లోకి తెస్తున్నారు. ఆదేశిక సూత్రాలు చెప్పిన న్యాయం, మానవీయ పని పరిస్థితి, జీవించేందుకు సరిపడా వేతనాలకు భరోసా,మంచి జీవితం,తగిన విరామం లాంటి బాధ్యతలను గాలికొదిలేశారు. ఆధునికశాస్త్ర సాంకేతిక యంత్రాలను వినియోగించిన క్రమంలో అవసరం లేని కార్మికులను తొలగించేందుకు హైర్ & ఫైర్ పద్ధతిని చట్టబద్ధం చేశారు. ఉత్పత్తి ప్రక్రియలో శ్రమిస్తున్న కార్మికుల వాట వేతన రూపంలో 30.27% నుండి 15.97% నికి తగ్గిపోయింది. ఇదే సమయంలో యజమానుల లాభాలు 23.39% నుండి 51.01% నికి పెరిగినాయి. నిత్య జీవిత అవసరాల ధరలు మాత్రం 3.8% నుండి 5.2% నికి పెరిగాయి. కార్మికుల ఆదాయాలను పెంచే చర్యలు చేపట్టి సరుకుల డిమాండ్ పెంచి పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించాల్సిన సోయి లేకపోగా రోజుకు రూ.176/-లు, నెలకు జీతం రూ.4576/-లు ఉంటే సరిపోతుందని ఈ విధానాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని తమ విధానాలకు సమ్మతి తెలుపని రాష్ట్రాలను పెట్టుబడులకు అనుకూలం కాని రాష్ట్రాలుగా చిత్రీకరిస్తున్నారు. మనుస్మృతిలోని కౌటిల్యుని అర్థశాస్త్రాన్ని ప్రస్తావిస్తూ కార్మికులు తమ ఖర్చులు తగ్గించుకోవాలని, శ్రమకు తగిన వేతనాలను హక్కుగా భావించవద్దని అడుకోవాలని, కార్మికుల సంక్షేమ భాధ్యత యజమానులు తీసుకోవాలంటే వారి మనసు మార్చడం ద్వారా సంపదలో కొంత భాగం ఖర్చు చేస్తారని ఆర్.ఎస్.ఎస్ సుద్దులు చెబుతున్నది. మహిళల భాగస్వామ్యం పెరగాలంటే మనుస్మృతిని ఆదర్శంగా తీసుకోవాలంటున్నారు. దీన్నిబట్టి ఎప్పటికి మహిళలు స్వతంత్రులుగా ఉండకూడదని, మహిళలపై లైంగిక దాడి చేసిన తప్పుగా భావించకూడదంటున్నారు. ఈ నిర్ణయాల వల్ల శ్రామిక మహిళలకు భద్రత,రక్షణ లేకుండ పోతుంది. ఇలాంటి ప్రమాదకర నిర్ణయాలను వెంటనే ఉపసవరించుకోవాలని కేంద్ర ప్రభుత్వనికి గోపినాయక్ డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రజా సంఘాల నాయకులు కట్ట శ్రీనివాస్ సిహెచ్ వెంకన్న మల్లేపాక వీరయ్య జి. మనోహర్ పర్సురాములు రాములు యండి లతిప్ పి.శివ నాయక్ లు మున్సిపల్ కార్మికులు హమాలీ కార్మికులు భవన నిర్మాణం కార్మికులు ఆటో డ్రైవర్ లు తదితరులు పాల్గొన్నారు.

# దూరదర్శన్ తొలితరం న్యూస్ రీడర్ సరళా మహేశ్వరి కన్నుమూత



హైదరాబాద్,**ఫిబ్రవరి 12ప్రజావినికిడి,:** భారత టెలివిజన్ రంగంలో సుపరిచితమైన ముఖం, దూరదర్శన్ సీనియర్ న్యూస్ యాంకర్ సరళా మహేశ్వరి (71) కన్నుమూశారు. ఆమె మృతి పట్ల దూరదర్శన్ నేషనల్ చానల్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆమె సౌమ్యమైన స్వరం, స్పష్టమైన ఉచ్చారణ, వార్తలను హుందాగా అందించే తీరుతో భారతీయ వార్తా ప్రపంచంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని నివాళి అర్పించింది. “దూరదర్శన్ కుటుంబం తరఫున సరళా మహేశ్వరికి హృదయపూర్వక నివాళులు. ఆమె తన సరళత, హుందాతనంతో వీక్షకులలో చెరగని ముద్ర వేశారు” అని డీడీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. సరళాతో కలిసి పనిచేసిన సీనియర్ యాంకర్ షమ్మీ నారంగ్ కూడా ఆమె మృతిపై విచారం వ్యక్తం చేశారు. “సరళా సౌజన్యానికి, మర్యాదకు ప్రతిరూపం. అపారమైన భాషా పరిజ్ఞానం కలిగిన వ్యక్తి” అని ఆయన పేర్కొన్నారు. ఆమె మృతితో టెలివిజన్ జర్నలిజంలో ఒక స్వర్ణయుగం ముగిసిందని మహిళా కాంగ్రెస్ అభివర్ణించింది. ఢిల్లీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న సమయంలో, 1976లో సరళా మహేశ్వరి దూరదర్శన్‌లో న్యూస్ అనౌన్సర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. భారత టెలివిజన్ రంగంలో లైవ్‌లో వార్తలు చదివిన తొలితరం యాంకర్లలో ఆమె ఒకరు. 1984 వరకు డీడీలో పనిచేసి, ఆ తర్వాత యూకే వెళ్లి 1986 వరకు బీబీసీలో న్యూస్ రీడర్‌గా సేవలందించారు. 1988లో తిరిగి భారత్‌కు వచ్చి మళ్లీ దూరదర్శన్‌లో చేరారు. బ్లాక్ అండ్ వైట్, తొలితరం కలర్ టీవీల కాలంలో తన ప్రశాంతమైన, హుందా శైలితో ఆమె ప్రతి ఇంట్లోనూ సుపరిచితమైన, విశ్వసనీయమైన యాంకర్‌గా నిలిచారు.

# మాదాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు

## నిర్మాణాలు కూల్చివేస్తుండగా అడ్డుకున్న స్థానికులు



హైదరాబాద్,**ఫిబ్రవరి 12ప్రజావినికిడి,** హైదరాబాద్‌లోని మాదాపూర్ ఖానామెట్‌లో ఉద్రిక్తత నెలకొంది. సర్వే నెంబర్ 55లో రోడ్డుపై ఉన్న దుకాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఇక్కడి అర్ధనారీశ్వర ఆలయం సమీపంలోని నిర్మాణాలను కూల్చివేస్తుండగా ఆలయ కమిటీ సభ్యులు, పుజారులు, స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఈ నిర్మాణాలపై స్టేటస్ కో ఉందని అయినప్పటికీ హైడ్రా అధికారులు కూల్చివేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా కూల్చివేతలు చేపట్టారని ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని బాధితులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాగా, అనుమతులు లేకుండా భవనాలు, షెడ్డు నిర్మించారని ఆరోపిస్తూ హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ప్రభుత్వ భూమిలో రోడ్డు పక్కన అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేశారని, అవి అక్రమ నిర్మాణాలని హైడ్రా అధికారులు చెబుతున్నారు.

# తండ్రిని చంపిన తనయుడు.

## వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ విజయ్ కుమార్.

**ప్రజావినికిడి,(షాద్ నగర్):** మద్యం తాగించి,తండ్రిని నీటి గుంతలలో పడదోసిన కొడుకు హత్య సంఘటన ఫరూక్ నగర్ మండలంలో చోటుచేసుకున్నది.మృతుని భార్య మెగావత్ సోనీ ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఫరూక్ నగర్ మండలం దేవునిబండ తండాకు చెందిన మెగావత్ బాలు(43),మెగావత్ సోనీలకు ఒక కూతురు,కుమారుడు మోహన్(19)వయస్సు గుండు ఉన్నారు.ఎవరి పనులు చేసుకుంటూ వారు హాయిగా జీవిస్తూన్నారు.

హత్యకు దారి తీసిన కారణాలు.తండ్రి పేరుమీద ఉన్న 5 గుంటల భూమిని చెల్లెలు పెళ్లి కోసం అమ్మాలని తనయుడు తండ్రిని అడగగా,అందుకు తండ్రి నిరాకరించడంతో ఇద్దరి మధ్య గతంలో గొడవలు జరిగాయని పిర్యాదులో తెలిపారు.అయితే ఎవరైనా హంతకుడు గానీ దొంగ గానీ ఎక్కడో ఏదో చిన్న పొరపాటు లేక తప్పు చేసి

దొరికిపోతారు.ఇక్కడ కూడా అదే జరిగింది.మృతుని భార్య మెగావత్ సోనీ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తుండగా హంతకుడు(మోహన్),గురువారం ఉదయం సుమారు 9:30 సమయంలో పోలీసులను చూసి ఆటోలో పారిపోతుండగా కేశంపేట రోడ్డు,యాదాద్రి హోటల్ సమీపంలో పోలీసులు నిందితున్ని పట్టుకుని విచారించగా,హంతకుడు(మోహన్)కొడుకు,హతుడు( మెగావత్ బాలు)తండ్రి పొలం అమ్మడానికి అడ్డు పడుతున్నాడని తెలుసుకుని ఎలాగైనా చంపాలని



అనుకుని,గత ఆదివారం రాత్రి తండ్రిని,తనయుడు ఆటోలో షాద్‌నగర్‌లో తీసుకెళ్లి బాగా మద్యం తాగించి,అనంతరం నేరెళ్ల చెరువు గ్రామ శివారులోని చెరువు గుంతలో తోసివేసి తానే హత్యకు పాల్పడినట్లు తనయుడు తెలిపాడని పోలీసులు వెల్లడించారు.

**అభినందించిన డీసీపీ శ్రీమతి సిహెచ్ శిరీష,ఏసీపీ ఎస్.లక్ష్మీనారాయణ..**

ఈ కేసు విచారణ షాద్‌నగర్ డీసీపీ శ్రీమతి సిహెచ్ శిరీష,ఏసీపీ ఎస్ లక్ష్మీనారాయణ,కే.విజయ్ కుమార్ ల పర్యవేక్షణలో జరిగిందన్నారు.విచారణాధికారి ఎస్.వెంకటేశ్వర్లు,శ్రీమతి సుశీల,హెడ్ కానిస్టేబుళు /పీసీలు బాల్‌రాజు,మోహన్,రాజేష్, జోత్స్న,నరేందర్ ల కీలక పాత్ర

పోషించారన్నారు.వారికి పై అధికారుల ద్వారా రివార్డులు అందజేయనున్నారు.ఈ సందర్భంగా డీసీపీ శ్రీమతి సిహెచ్ శిరీష,ఏసీపీ ఎస్.లక్ష్మీనారాయణ అభినందించారు.నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు.ఒక ఆటో రిజిస్ట్రేషన్ నం.టిఎస్.06 UD 911,వన్‌ప్లస్ మొబైల్ ఫోన్,కాగా,పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరుపరచామన్నారు.

# నారాయణ పాఠశాలను సీజ్ చేయాలి



**ప్రజావినికిడి, (మియాపూర్):** పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మియాపూర్ నారాయణ పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రాము గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి బృందం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి అడిషనల్ డైరెక్టర్ కంది మల్ల లింగయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మియాపూర్‌లోని నారాయణ పాఠశాలలో ఫిబ్రవరి 10న జరిగిన అగ్ని ప్రమాద ఘటన సాధారణమైనది కాదని ఇది పాఠశాల నిర్లక్ష్యం వల్లే జరిగిందన్నారు. బాధ్యతారాహిత్యంపిల్లల ప్రాణాలతో ఆడుకున్న ప్రమాదకర వ్యవహారం అన్నారు.సెల్లార్ నుండి మంటలు, పొగలు రావడం దాదాపు 800 మంది విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టివేసేదన్నారు. మంటలు మరింత వ్యాపించి ఉంటే పెద్ద ప్రమాదం సంభవించేదని తెలిపారు. ముఖ్యంగా విద్యాశాఖ సరైన అనుమతులు లేకుండా పాఠశాల నడపడం సరికాదన్నారు. ఫైర్ సేఫ్టీ పరికరాల లేమి.అత్యవసర నిష్క్రమణ మార్గాలు లేకపోవడం.ఫైర్ డిపార్ట్‌మెంట్ ఎన్‌వోసీ లేదు. పాఠశాల కింద సెల్లార్‌లో కెమికల్స్ నిల్వ ఉంచడం. ఇది కేవలం యాజమాన్యం తప్పిదం మాత్రమే కాదు ఇది సంబంధిత అధికారుల వైఫల్యం కూడా. ఈ ఘటన ప్రభుత్వం నిర్లక్ష్యానికి స్పష్టమైన ఉదాహరణ. నారాయణ పాఠశాలను వెంటనే సీజ్ చేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత విద్యాశాఖ,ఫైర్ అధికారులపై విచారణ జరపాలి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ పాఠశాలలపై అత్యవసర ఫైర్&సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి. ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొడంగల్ శ్రీనివాస్, రాకేష్ రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

## చదరంగం మాస్టర్ వానరాశి జగన్

# ఆధ్వర్యంలో శిష్యుల సత్తా

### వేదిక ఏదైనా..-మొదటి బహుమతి తమదే..



**ప్రజావినికిడి,(షాద్‌నగర్):** పట్టణంలోని ఇండియన్ హైట్స్ పాఠశాలలో నిర్వహించిన టౌన్ లెవల్ చదరంగం పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. అండర్ 08,10,12,14,16 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించిన ఈ పోటీల్లో షాద్‌నగర్ చెస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి మెరిశారు.అండర్08 విభాగంలో సాయి సౌరేష్,నందిక, వేదాన్ష్ మెప్పించగా, అండర్10లో కార్తికేయ,నిఖిల్, లక్ష్మణ్ సిద్ధార్థ్, శ్రీమన్ రెడ్డి, ఆయుష్ ప్రతిభ చాటారు. అండర్12లో శ్రీ హర్షిత్, వేదాదిత్యం రాణించగా, అండర్14లో సాయి సుశాంత్, భాను తేజ సత్తా చూపించారు. అండర్16 విభాగంలో సాత్విక్ చందర్ అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.వీరు అందరూ మెరిట్ సర్టిఫికెట్లు, ట్రోఫీలు,గోల్డ్ మెడల్స్ సాధించి తమ ప్రతిభను నిరూపించారు. చిన్నారులు చూపిన ఆటతీరు ప్రేక్షకులను అలరించడమే కాకుండా, భవిష్యత్తులో రాష్ట్ర,జాతీయ స్థాయిలో రాణించగల సామర్థ్యం తమలో ఉందని నిరూపించింది.ఈ సందర్భంగా కోచ్ వానరాశి జగన్ మాట్లాడుతూ,చదరంగం ఆట మెదడుకు పదును పెడుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నిర్ణయశక్తి పెంపొందిస్తాయి.చిన్నప్పటి నుంచే చెస్ అలవాటు చేసుకుంటే పిల్లలు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటారని తెలిపారు.గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.పోటీల్లో విజేతలైన విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు.షాద్‌నగర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఇలాంటి పోటీలు మరిన్ని నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

## షాద్‌నగర్‌లో సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం

# ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన

**కార్మిక,రైతు, ప్రజా వ్యతిరేక చట్టాలను ఉపసంహరించాలంటూ డిమాండ్**

**దండులా కదిలిన అంగన్వాడి ఏఎన్ఎం,ఆశ వర్కర్లు, కార్మికులు, కర్షకులు**

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.రాజు**




**ప్రజావినికిడి,(షాద్ నగర్);** కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న 4 లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా షాద్‌నగర్‌లో బైక్ ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐటి జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ రాజు బైక్ ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్ అధ్యక్షతన ఎంపీడీవో కళాకారుల భవనంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పలువురు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడారు అక్కడి నుంచి సుమారు 500 మంది అంగన్వాడీలు ఏఎన్ఎం,ఆశా వర్కర్లు,రైతులు, కార్మికులు పెద్దఎత్తున ఎంపీడీవో కార్యాలయం నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తూ స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు నినాదాలతో పట్టణం మార్మోగించారు.ఈ సందర్భంగా ఎన్.రాజు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు,ప్రజా వ్యతిరేక విధానాలతో హక్కులను హరించేస్తోందని మండిపడ్డారు. స్వాతంత్ర్యానంతరం పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్లు పెట్టుబడిదారులకు మేలు చేసేలా రూపొందించారని విమర్శించారు. హైర్ అండ్ ఫైర్ విధానంతో ఉద్యోగ భద్రత లేకుండా చేసి శాశ్వత ఉద్యోగాలకు మంగళం పాడుతున్నారని తెలిపారు.

కార్మికుల యూనియన్ ఏర్పాటు,సమ్మె, నిరసన హక్కులను కట్టడి చేస్తూ కోర్ యాక్టివిటీల్లో కూడా కాంట్రాక్ట్ కార్మికులను నియమించుకునే స్వేచ్ఛ యాజమాన్యాలకు కల్పించారని చెప్పారు.100 మంది స్థానంలో 300 మంది కార్మికుల వరకు అనుమతి లేకుండా తొలగింపులు చేసే అవకాశం ఇవ్వడం కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఫ్లోర్ లెవల్ వేతనం..పేరుతో రోజుకు రూ.178 మాత్రమే నిర్ణయించడం జీవనోపాధిని దెబ్బతీస్తుందని,8 గంటల పని దినం స్ఫూర్తిని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.అంగన్వాడీ,ఆశా, మధ్యాహ్న భోజనం,ఉపాధి హామీ,నేషనల్ హెల్త్ మిషన్ వంటి పథకాలలో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించకపోవడం అన్యాయమని, విద్యుత్ సవరణ చట్టం2025, విత్తన సవరణ బిల్లు,ఎల్ఐసీలో 100 శాతం విదేశీ పెట్టుబడులు వంటి నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా భవిష్యత్తులో జరగబోయే సార్వత్రిక సమ్మెలో తెలంగాణ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ ప్రజా సంఘాల వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బిసా సాయి బాబు. నర్సింలు తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా ఉపాధ్యక్షుడు శీను నాయక్, వెంకటేష్ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా



అధ్యక్షుడు ఆశన్న భుజంగ రెడ్డి, అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు జయమ్మ జయ గౌడ్ ఇందిరా ఊర్మిళ ఇంద్ర స్వప్న లలిత అలివేలు నాట్కో సిఐటియు యూనియన్ నాయకులు మల్లేష్ గౌడ్,జైపాల్ రెడ్డి,టి.అంజయ్య,గణేష్,కిషోర్, సుబ్బారావు,రవీందర్ రెడ్డి,ఆశా వర్కర్లు సుజాత,రమాదేవి, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్,నాయక్ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు,ఎస్ డబ్ల్యు ఎఫ్ నాయకులు రవీందర్ రెడ్డి,ముస్తఫా,జన వేదిక రాష్ట్ర నాయకులు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ని కార్పోరేషన్‌లు అయినా ఎగిరేది గులాబీ జెండాయే

## శేరిలింగంపల్లి నేతలతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్,**ఫిబ్రవరి 12ప్రజావినికిడి,:** హైదరాబాద్ కార్పొరేషన్‌ను ఎన్ని కార్పొరేషన్లు చేసినా ఎగిరేది మాత్రం ఖచ్చితంగా గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలోకేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేలు పోయినా.. పార్టీ వెన్నెముక కార్యకర్తలేనన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా, కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. మొత్తం హైదరాబాద్‌లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచింది. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వెళ్లినా, బంగారం వంటి కొత్త నాయకులు వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారు.

శేరిలింగంపల్లిలోని 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా మనకుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతుల వైకుంఠం చూపి అధికారం దక్కించుకుందని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు బీజేపీ 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని, అది 'పూజకు పనికిరాని పువ్వు' అని ఎద్దేవా చేశారు. 'వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి' అన్న నానుడిని గుర్తు చేస్తూ, తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు.

నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టపగలే సుల్తాన్ బజార్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో దోపిడీలు, చందానగర్‌లో జ్యువెలరీ షాపులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యాపారాలు, వాణిజ్య సంస్థలు కుదేలయ్యాయని, కొత్త కొలువులు రాకపోగా ఉన్నవి పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. త్వరలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల కోసం డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు కేటీఆర్. ఎమ్మెల్యే లేడని భయపడకండి, మీకు అండగా నేను, తలసాని శ్రీనివాస్ యాదవ్, అరికెపూడి, కృష్ణారావు ఉంటాం. ఏ అవసరమొచ్చినా మేము అందుబాటులో ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తప్పుడు ఓటు వేస్తే ఐదేళ్ల పాటు శిక్ష అనుభవించాల్సి వస్తుందని, ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని.. ముఖ్యంగా మహిళా లోకానికి కేటీఆర్ విన్నవించారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ్ కుమార్ రెడ్డి వంటి యువకులు పార్టీకి ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు , నేతలు పాల్గొన్నారు.

# గర్భిణీ మహిళ రక్షణకు చర్యలు

## మానవ హక్కుల కమిషన్ ఆదేశం

హైదరాబాద్,**ఫిబ్రవరి 12ప్రజావినికిడి,** లంగాణ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన గురువారం మహేష్ ఫిర్యాదును పరిశీలించింది. యాదగిరిగుట్ట ఆలయంలో భాగ్యతో లవ్ మ్యారేజ్ చేసుకున్న అనంతరం, ఆ వివాహానికి వ్యతిరేకంగా ఉన్న ఆమె తండ్రి మరియు బావ కలిసి కల్వకుర్తి సమీపంలోని ఆసుపత్రిలో ఆమె నాలుగు నెలల గర్భాన్ని బలవంతంగా తొలగించేందుకు ప్రయత్నించారని, ఈ తీవ్ర ఒత్తిడి కారణంగా ఒక దశలో ఆమె ఆత్మహత్యకు కూడా ప్రయత్నించిందని, అలాగే పోలీసుల వైపు నుంచి ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం ద్వారా నిర్లక్ష్యం జరిగిందని పేర్కొన్న ఆరోపణలను కమిషన్ తీవ్రంగా పరిగణించింది. మహిళ స్వేచ్ఛా మరియు స్వచ్ఛంద సమ్మతి లేకుండా గర్భస్రావం చేయడం చట్టపరంగా తీవ్రమైన నేరమని పేర్కొన్న హక్కుల కమిషన్. కల్వకుర్తి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ మరియు వంగూరు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలను తక్షణమే ఫిర్యాదుపై స్పందించి చట్టప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని, నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో వ్యవహారాన్ని పర్యవేక్షించాలని ఆదేశిస్తూ, ఈ విషయంపై 26.02.2026 నాటికి సమగ్ర నివేదిక సమర్పించాలని మరియు అత్యవసరంగా సంబంధిత అధికారులకు ఉత్తర్వులు తెలియజేయాలని ఆదేశించింది. ఇదిలావుంటే తెలుగు దినపత్రికలో 'అల్లరి చేస్తున్నాడని కన్నుపోయేలా దాడి? బాలుడిపై అంగన్వాడీ టీచర్ దాష్టీకం' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తా నివేదికను సుమోటోగా కేసు నమోదుచేశారు. ఈ అంశం పై వివరణాత్మక నివేదికను సమర్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ వారిని ఆదేశించారు.

# ఉగాదికి సనత్‌నగర్ టిమ్స్

## మార్చి రెండో వారానికల్లా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశం



**సిద్ధమైన 16 ఆపరేషన్ థియేటర్లు**
**రెడీగా సీటీ స్కాన్, ఎంఆర్ఐ మిషన్లు**
**గుండె ఆపరేషన్ల కోసం క్యాథల్యాబ్**
**అవయవమార్పిడి కోసం ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్**
**ఏర్పాట్లపై మంత్రి దామోదర్ రాజనర్సింహ రివ్యూ**

హైదరాబాద **ఫిబ్రవరి 12 (జర్నలిస్టు జర్నీ న్యూస్)** :పేదలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఉగాది పండుగ రోజున ఈ హాస్పిటల్‌ను ప్రారంభించి ప్రజలకు అంకితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈలోగా సివిల్ పనులు, ఎక్విప్‌మెంట్ ట్రయల్స్ అన్నీ పూర్తి చేసి, హాస్పిటల్‌ను వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీస్‌లో టిమ్స్ సనత్‌నగర్ పనుల పురోగతి, డాక్టర్లు, సిబ్బంది నియామకంపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓపీ రూమ్‌లు, డయాగ్నస్టిక్స్, ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్లు, వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. 1000 బెడ్ల కెపాసిటీతో నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్‌లో మౌలిక వసతుల కల్పన తుది దశకు చేరుకుందని అధికారులు మంత్రికి వివరించారు. హాస్పిటల్ అత్యంత కీలకమైన 16 ఆపరేషన్ థియేటర్లు శస్త్రచికిత్సలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రోగ నిర్ధారణ కోసం అత్యాధునిక సీటీ స్కాన్, ఎంఆర్ఐ , డిజిటల్ ఎక్స్-రే మిషన్ల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. డయాగ్నస్టిక్స్ యంత్రాలు ఇన్‌స్టాలేషన్ జరుగుతోందన్నారు. మార్చి రెండో వారం నాటికి అన్ని పనులు, ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్ ప్రారంభమయ్యే నాటికి టెక్నీషియన్లకు, సిబ్బందికి ట్రైనింగ్ కూడా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. సనత్‌నగర్ టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కార్డియాక్ కేర్, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్ఎ÷-లాంటేషన్‌గా తీర్చిదిద్దాలని గతంలోనే అధికారులకు మంత్రి సూచించారు. ఇందుకు అనుగుణంగా అన్నిరకాల గుండె సంబంధిత ఆపరేషన్లు చేసేలా, అవయవమార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించేలా క్యాథల్యాబ్స్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ థియేటర్ల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. క్యాథల్యాబ్ ఏర్పాటు పనులు చివరి దశలో ఉన్నాయని, ఓటీలు ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. నగరంలోని నిమ్స్, ఉస్మానియా, గాంధీ హాస్పిటల్‌పై పెరుగుతున్న రోగుల ఒత్తిడిని తగ్గించేందుకు టిమ్స్ సనత్‌నగర్ ప్రధాన భూమిక పోషిస్తుందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఆయా హాస్పిటళ్లలో శస్త్రచికిత్సల కోసం నెలల తరబడి వేచి చూస్తున్న రోగులను ఇక్కడికి రిఫర్ చేసి, త్వరితగతిన వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. దీనికి సంబంధించి ఆయా హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. హాస్పిటల్ నిర్వహణకు అవసరమైన ప్రొఫెసర్లు, డాక్టర్లు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది నియామక ప్రక్రియపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆరా తీశారు. పూర్తిగా కొత్త హాస్పిటల్ అయినందున.. డీఎంఈ, నిమ్స్ పరిధిలోని సీనియర్ డాక్టర్ల సేవలను సనత్‌నగర్ టిమ్స్‌లో వినియోగించుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. అలాగే, పారిశుధ్యం, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సేవలను అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ విషయంలో ఇప్పటికే నగరంలోని పలు కార్పొరేట్ హాస్పిటల్స్, నిమ్స్, ఎయిమ్స్‌లో అనుసరిస్తున్న పద్ధతులను డీఎంఈ నేతృత్వంలోని కమిటీ అధ్యయనం చేసి, నివేదిక అందజేసింది. ఆయా హాస్పిటల్స్‌లో అవలంభిస్తున్న బెస్ట్ ప్రాక్టీస్ విధానాలనే టిమ్స్‌లోనూ అమల్లోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. మెడికల్ సర్వీసెస్‌తో పాటు సానిటేషన్, సెక్యూరిటీ వంటి నాన్ మెడికల్ సర్వీసెస్ విభాగాలు కూడా పటిష్టంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. రోగులకు ఓపీ రిజిస్ట్రేషన్ నుంచి డిశ్చార్జి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ-హెచ్ఎంఐఎస్ (ı-ఊఓఎ÷ూ) సాఫ్ట్‌వేర్ ద్వారా సేవలను అనుసంధానించాలని మంత్రి సూచించారు. రోగులకు, వారి సహాయకులకు నాణ్యమైన భోజనం అందించేందుకు సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. మార్చి 15 నాటికి పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులన్నీ పూర్తి చేసి, ఉగాది నాటికి హాస్పిటల్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

# స్పోర్ట్స్ హ్యాకథాన్‌కు పోస్టర్, లోగో ఆవిష్కరణ

## గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి 12ప్రజావినికిడి,**

హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో స్పోర్ట్స్ హ్యాకథాన్‌కు పోస్టర్ / లోగోను మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, హ్యాకథాన్ నిర్వహకులు సందీప్ కుమార్ మక్తాలు ఆవిష్కరించారు. ప్రపంచంలోనే మొట్టమొద,అతిపెద్ద స్టేడియం స్థాయి స్పోర్ట్స్ ఇన్నోవేషన్ లీగ్ అయిన స్పోర్ట్స్ హ్యాకథాన్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య, క్రీడా, యువజన సర్వీసులు శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. స్పోర్ట్స్ హ్యాకథాన్ కేవలం ఒక పోటీ కార్యక్రమం మాత్రమే కాదని, ఇది క్రీడలు మరియు సాంకేతికతను సమన్వయం చేసే విశ్వస్థాయి ఉద్యమమని మంత్రి పేర్కొన్నారు. సంప్రదాయ హ్యాకథాన్‌లకు భిన్నంగా, ప్రొఫెషనల్ స్టేడియంలో నిర్వహించబడే ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు ప్రత్యక్షంగా క్రీడల్లో పాల్గొని, ఆ అనుభవాన్ని ఆధారంగా చేసుకుని క్రీడలకు సంబంధించిన వాస్తవ సమస్యలకు సృజనాత్మక మరియు ఆచరణాత్మక పరిష్కారాలను రూపొందిస్తారని తెలిపారు. తెలంగాణలోని అన్ని 33 జిల్లాల నుండి యువత, క్రీడాకారులు, విద్యార్థులు, టెక్నాలజీ నిపుణులు మరియు స్టార్టప్‌లను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, సుమారు 10,000 మంది పాల్గొనేవారిని సమీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి వెల్లడించారు. అంతేకాకుండా, కొంతమంది అంతర్జాతీయ ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననుండటం విశేషమన్నారు. ప్రపంచంలోనే మొదటి స్టేడియం స్థాయి స్పోర్ట్స్ హ్యాకథాన్ కావడంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించే దిశగా కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఈ వినూత్న నమూనా ద్వారా తెలంగాణను క్రీడా ఆవిష్కరణల గ్లోబల్ కేంద్రంగా నిలబెట్టడం మా లక్ష్యమని స్పష్టం చేశారు.స్పోర్ట్స్ హ్యాకథాన్ ద్వారా యువతలో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం లభిస్తుందని, క్రీడా రంగ భవిష్యత్తును రూపుదిద్దే చారిత్రాత్మక అడుగుగా ఇది నిలుస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మార్చి 28, 29 తేదీలలో జరిగే స్పోర్ట్స్ హ్యాకథాన్ లో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొనాలని

# రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టు అక్రిడిటేషన్ కార్డులు

## పారదర్శకంగా అర్హులందరికీ న్యాయం - సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



హైదరాబాద్, **ఫిబ్రవరి 12ప్రజావినికిడి,** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌వో జి. మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. 2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు. అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# 15న సంత్ సేవాలాల్ జయంతి

## బంజారా భవన్‌లో కార్యక్రమాలు

హైదరాబాద్,**ఫిబ్రవరి 12ప్రజావినికిడి,** ఈ నెల 15 వ తేదీ ఉదయం 11.00 గంటలకు హైదరాబాద్లో ఉన్న బంజారాహిల్స్ లోని సేవాలాల్ బంజారా భవన్లో లంబాడీ గిరిజనుల సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఘనంగాజరుగనుంది. ఈ జయంతి ఉత్సవాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, రాష్ట్రానికి చెందిన అందరు గిరిజన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక కార్పొరేటర్ తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని గిరిజన సంక్షేమ శాఖామాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా లంబాడీ గిరిజన సాంప్రదాయ పద్ధతి ప్రకారం సంత్ సేవాలాల్ ఆరాధన కార్యక్రమాలు, గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గౌరవ మంత్రివర్యులు మాట్లాడుతూ 2024 నాటి సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొని గౌ. ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారు అప్పటి వరకు వేడుకలకు ఖర్చు పెడుతున్న రూ. కోటిని రూ. రెండు కోట్లుగా రెట్టింపు చేయడమే కాకుండా బంజారా ఉద్యోగులకు ఉత్సవాలు జరుపుకోవడానికి వీలుగా ఫిబ్రవరి 15 నాడు స్పెషల్ లీవ్ శాంక్షన్ చేశారని గుర్తు చేశారు. ఈ నెల 15 నుంచి 21 వరకు అన్ని జిల్లాలలోని అన్ని ఎమ్మెల్యే నియోజకవర్గాలలో జరుగనున్న సేవాలాల్ జయంతి ఉత్సవాల నిర్వహణకై రాష్ట్ర ప్రభుత్వం రూ. రెండు కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతూ అందరికీ ఆహ్వానం పలికారు.

# పారామెడికల్ కాలేజీ విద్యార్థుల ఫీజు మదింపు

హైదరాబాద్,**ఫిబ్రవరి 12ప్రజావినికిడి,** రాష్ట్రంలోని పారా మెడికల్ కళాశాలల్లో చదివే దాదాపు 30 వేల మంది విద్యార్థుల ఫీజు స్ట్రక్చర్ వివరాలను ఈ-పాస్ లో వెంటనే ఆప్లోడ్ చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షహేమా శాఖ మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని పారా మెడికల కళాశాలల్లో చదువుతున్న ఎస్.సి. ఎస్.టి, బీ.సి లకు చెందిన విద్యార్థులకు సంబందించిన ఫీజు స్ట్రక్చర్ ను 2024 -25 నుండి ఈ-పాస్ లో పెట్టనందున దాదాపు 30 వేల మంది విద్యార్థులు స్కాలర్షిప్స్ కోల్పోయే ప్రమాదం ఉందని పారా మెడికల అసోసియేషన్ అధ్యక్షులు ఎం. శ్రీనివాస్, రావు, కార్యదర్శి మోహన్ రెడ్డి లు నేడు మంత్రి లక్షణ్ కుమార్ కు విజ్ఞాపన పత్రాన్ని అందించారు. దీనిపై స్పందించిన మంత్రి ఈ విషయంలో వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సిందిన సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ఎర్రకోట దాడి వెనుక జైషే హస్తం..

## నవంబర్ 9 నాటి దాడిలో 15 మంది మృతి

## జైషేపై ఐరాస సంచలన నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ,**ఫిబ్రవరి 12ప్రజావినికిడి,:** పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహమ్మద్ (జేఈఎం) ఉగ్రవాద సంస్థపై ఐక్యరాజ్యసమితి (యూఎన్) సంచలన నివేదికను విడుదల చేసింది. గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన ఉగ్రదాడి వెనుక జైషే హస్తం ఉందని, ఆ సంస్థ మహిళలతో ప్రత్యేకంగా ఒక ఉగ్రవాద విభాగాన్ని కూడా ఏర్పాటు చేసిందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఐరాస భద్రతా మండలికి చెందిన ఆల్-ఖైదా, ఐసిస్ ఆంక్షల పర్యవేక్షణ బృందం ఈ నివేదికను రూపొందించింది. 2025 నవంబర్ 9న ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన దాడిలో 15 మంది మరణించారని, ఈ ఘటనతో జైషే మహమ్మద్‌కు సంబంధం ఉన్నట్లు తమకు సమాచారం అందిందని పేర్కొంది. ఈ దాడితో పాటు మరికొన్ని దాడులకు జైషే బాధ్యత వహించినట్లు ఒక సభ్య దేశం తెలిపినట్లు నివేదికలో పొందుపరిచారు. అంతేకాకుండా జైషే చీఫ్, అంతర్జాతీయ ఉగ్రవాది మసూద్ అజార్ 2025 అక్టోబర్ 8న 'జమాత్ ఉల్-ముమినత్' పేరుతో మహిళా విభాగాన్ని అధికారికంగా ప్రకటించినట్లు నివేదిక తెలిపింది. ఉగ్రవాద దాడులకు మద్దతు ఇవ్వడమే లక్ష్యంగా ఈ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. అయితే, ఈ నివేదికలో మరో ఆసక్తికరమైన అంశం వెలుగులోకి వచ్చింది. ఒక సభ్య దేశం (పాకిస్థాన్ అని భావిస్తున్నారు) మాత్రం జైషే సంస్థ ఎప్పుడో 'నిర్వీర్యం' అయిపోయిందని వాదించింది. నివేదికలో జైషే ప్రస్తావనపై పాకిస్థాన్ తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పాకిస్థాన్ వాదన ఎలా ఉన్నప్పటికీ, జైషే మహమ్మద్ ఇప్పటికీ చురుకుగా కార్యకలాపాలు సాగిస్తోందని, అంతర్జాతీయ భద్రతకు ముప్పుగా పరిణమించిందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.


# అంబటికి మళ్లీ రిమాండ్

## లాటరీ కేసులో ఈ నెల 26 వరకు విధించిన గుంటూరు కోర్టు

**గుంటూరు, ఫిబ్రవరి 12ప్రజావినికిడి,**

సంక్రాంతి లాటరీ పేరిట మోసగించిన కేసులో మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు అంబటి రాంబాబుకు ఈ నెల 26 వరకు గుంటూరులోని ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు రిమాండ్ విధించింది. దీంతో ఆయనను తిరిగి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ముఖ్యమంత్రిపై బూతులు మాట్లాడిన కేసులో, పోలీస్ అధికారితో దురుసుగా ప్రవర్తించిన కేసులో ఆయన ఇప్పటికే జైలులో ఉన్నారు. 2023 జనవరిలో, అప్పటి వైసీపీ ప్రభుత్వం హయాంలో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా చట్ట విరుద్ధంగా, నిషేధిత లాటరీ నిర్వహించారంటూ అంబటి రాంబాబుపై జనసేన జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది గాదె వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో సత్తెనపల్లి టౌన్ పోలీసులు పీటీ వారంట్‌పై గురువారం అంబటిని రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి గుంటూరు కోర్టుకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జడ్జి కుముదిని ఎదుట ఇరుపక్షాల న్యాయవాదులు వాదనలు వినిపించారు. అంబటి తరపున మాజీ ఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రాంబాబుపై రాజకీయ ప్రేరేపితమైన కుట్రలో భాగంగానే పాత కేసును ఇప్పుడు తెరపైకి తెచ్చారని, మిగిలిన కేసుల్లో బెయిల్ రావడంతో కావాలనే హడావుడిగా అదనపు సెక్షన్లు జోడించారని ఆరోపించారు. అందువల్ల పీటీ వారంట్‌ను డిస్మిస్ చేయాలని వాదించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీలు విజయలక్ష్మి, జగదీశ్ వాదనలు వినిపించారు. టీడీపీ లీగల్ సెల్ న్యాయవాది శ్రీరామ్ రాజీవ్ ఆనంద్ వారికి సహకరించారు. "2023లో వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కోర్టు ఆదేశాల మేరకు అంబటి రాంబాబుపై క్రిమినల్ కేసు నమోదయింది. ఆ కేసులో 2025లో 14 మంది సాక్షులను విచారించాం" అని తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు అంబటి రాంబాబు చేసిన నేరానికి సంబంధించిన ఆధారాలను వారు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బలవంతంగా పెన్షనర్లకు, ప్రజలకు లాటరీ టికెట్లు విక్రయించిన వీడియోలను జడ్జికి అందించారు. అంతేగాక అంబటి స్వయంగా లక్కీ డిప్ తీసిన వీడియోను కూడా పెన్ డ్రైవ్‌లో అందజేశారు. వాటిని పరిశీలించిన జడ్జి కుముదిని ఈ నెల 26 వరకు అంబటికి రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కాగా, అంబటిని ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు.

# సింగరేణి సిఎండిగా బుద్ధప్రకాశ్ బాధ్యతలు




హైదరాబాద్,**ఫిబ్రవరి 12ప్రజావినికిడి,:** సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అధికారిక బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ తెలంగాణ కేడర్‌కు చెందిన బుద్ధ ప్రకాష్ గతంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేశారు. రవాణా, భూమి రికార్డులు , సామాజిక సంక్షేమంలో విస్తృత అనుభవం ఆయనకు ఉంది. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల కమిషనర్ , ఇన్‌స్పెక్టర్ జనరల్, సర్వే సెటిల్మెంట్లు అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ , భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# దివాళా పథకాలకు అడ్డుకట్ట వేసేదెవరు

**ఫిబ్రవరి 12ప్రజావినికిడి,**
ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా..అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది. విపక్షంలో ఉన్నవారు మరిన్ని ఉచితపథకాల గురింగి డిమాండ్ చేస్తున్నారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో ఏమేమి చేశామో అని కాంగ్రెస్ వివరించింది. విపక్ష బిఆర్ఎస్ మాత్రం ఇవ్వని జాబితా చదివింది. తులం బంగారం ఇచ్చారా..రైతుబంధు వేశారా..పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీశారు. గురుకులాలు అధ్వానంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. ఇకపోతే ఇప్పటి లక్షా 25కోట్ల అప్పుల చేశారని అంటున్నారు. పెన్షనర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో ఫలానా పథకం ఆగిందని ఆరోపిస్తున్నారు. చంద్రబాబు కూడా చేతిక ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంప ముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటి కప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేన్నప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరువు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడాని కన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు




ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్ళీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు.

ఈ పద్దతి ఏ ప్రభుత్వానికీ మంచింది కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్నాయి. జీతాలు కూడా చెల్లించ లేనప్పుడు మళ్లీ జనం నుంచే వసూలు చేయాలి. ఓటర్లకు ఆశ పెట్టి తాత్కాలిక లబ్దిని చేకూర్చడం ఎంతవరకు సబబో నేతలు ఆలోచన చేయడం లేదు. ఉచితాల పంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిం దని చెప్పడం అలవాటు చేసుకున్నారు. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతు లెత్తేయడం పరిపాటిగా మారింది. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించినా పట్టింపు లేదు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఆధునిక భారతదేశం అంధకార యుగంలోకి జారిపోతోందని ప్రధాని నరేంద్ర మోడీ ఒకా నొక సందర్భంలో ఆందోళన వ్యక్తం చేసారు. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్ ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించలేమని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ గతంలో హెచ్చరించారు. ఆనాడు దీనిని అనేక రాజకీయపార్టీలు కూడా వ్యతిరేకించాయి. మోడీకి సంక్షేమం పట్ల సానుకూల వైఖరి లేదని విమర్శించారు. కానీ ఎంతో విచిత్రంగా ఆ తర్వాత ఏడాది మధ్యప్రదేశ్‌లో లక్ష్మీమోహనాపథకం క్రింద మహిళలకు నెలకు రూ.1250 చొప్పున చెల్లిస్తామని, క్రమంగా దాన్ని రూ. 3వేల వరకు పెంచుతామని భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. మొన్న మహారాష్ట్రలో కూడా ఇదేవిధంగా ఇలాంటి పథ కాన్నే ప్రకటించారు. బీహార్‌లో కూడా ఇలాంటి పథకంతోనే గట్టెక్కారు. అంతకు ముందు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూడా అంతేచేసింది. దీన్నిబట్టి ఉచితాలను వ్యతిరేకించినవారే సమయాను కూలంగా వాటిని మళ్లీ తెరపైకి తెస్తున్నారు. నగదుబదిలీల వల్ల ప్రజల వినియోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత తోడ్పడుతుందనే వాదన ఒకటి ఉన్నది. అయితే ఉచిత మంత్రం అన్నిసార్లూ అందరికీ ఉపయోగపడదన్నది నిన్న మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో కేజీవాల్, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో జగన్ వంటి వారి ఓటమిని ఆపలేకపోయాయి. అందుకే అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు ఉచితాల విషయమై రాజ్యాంగపరంగా నిషేధాలు విధించడం అవసరమేమో ఆలోచించాలి. భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళనకర స్థాయికి తీసుకెళ్తాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ, ఎపిల అభివృద్ధికి ఉచిత పథకాలే అడ్డంకిగా మారాయి. తక్షణం వాటిని నివారించడంతో పాటు. ఈ బాధ్యతను కేంద్రప్రభుత్వమే తీసుకోవాలి. ఎన్నికల సంఘం కూడా ఈ పథకాల ప్రకటనలను నిషేధించాలి. ఒకసారి ఉచిత పథకాలు ప్రవేశ పెట్టాక వాటిని సమీక్షించుకునేందుకు ఏ ప్రభుత్వం ముందుకు రావడం లేదు. కిలో రూపాయి బియ్యం ఇందుకు ఉదాహరణ.

---------------

## రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

### లోక్‌సభలో బిజెపి ఎంపి నిషికాంత్ దూబె తీర్మానం



**న్యూఢిల్లీఫిబ్రవరి 12ప్రజావినికిడి,**
కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె గురువారం లోక్‌సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆయన వ్యాఖ్యలతో దేశాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ నిషికాంత్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాహుల్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాలం నిషేధం విధించాలని దూబే కోరారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. 'నేను రాహుల్ సోరస్ సంస్థతో చేతులు కలిపి దేశాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నారో వివరిస్తూ ఈరోజు లోక్‌సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. నేను ప్రతిపాదించిన తీర్మానంలో రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనను జీవితకాలం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని అభ్యర్థించాను' అని అన్నారు. కాగా, నిన్న రాహుల్‌గాంధీ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోడీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోయిందని, భరతమాతను అమ్మేశారని వ్యాఖ్యానించారు. మరుసటి రోజే ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి ఎంపి తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల తీర్మానానికి కేంద్రం విముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బీజేపీ ఏంపీ నిషికాంత్ దూబే గురువారం లోక్‌సభలో 'సబ్‌స్టాంటివ్ మోషన్' దాఖలు చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడమే కాకుండా, జీవితాంతం ఆయన ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ ప్రవేశపెట్టిన ఆ తీర్మానంపై కేంద్రం విముఖంగా ఉన్నట్టు సమాచారం.

## నాలుగేళ్ల మోడీ విదేశీ ఖర్చు రూ. 462.58కోట్లు




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 12ప్రజావినికిడి,** గత నాలుగేళ్లుగా అంటే 2021-2025ల మధ్య కాలంలో ప్రధాని మోడీ విదేశీ ప్రయాణాల కోసం అక్షరాలా రూ. 462.58కోట్లు ఖర్చు చేసింది. 2021-2025 మధ్య ప్రధాని మొత్తం 43 దేశాలను పలుమార్లు సందర్శించారు. వీటిలో అత్యధికంగా ఖర్చు చేసింది అమెరికా పర్యటనలకే. మొత్తం వ్యయంలో 16శాతం (74.4కోట్లు) నాలుగుసార్లు అమెరికా సందర్శనలకు ఖర్చు చేశారు. వ్యయం పరంగా జపాన్, ఫ్రాన్స్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జపాన్, ఫ్రాన్స్‌ల కోసం మొత్తం వ్యయంలో సుమారు 9శాతం ఖర్చు చేశారు. 2025లో ఫ్రాన్స్ సందర్శన అత్యంత ఖరీదైన పర్యటనగా నిలవనుంది. ప్రధాని మోడీ ఒక్కరే వెళ్లిన ఈ పర్యటన కోసం సుమారు 25.5కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ సమ్మిట్‌లో పాల్గనడంతో పాటు మార్సెయిల్‌లో భారత రాయబార కార్యాలయాన్ని ప్రారంభించారు. 2023 జూన్‌లో అమెరికా పర్యటనకు రూ.22.8కోట్లు వ్యయం కాగా, 2021 సెప్టెంబర్‌లో అమెరికా సందర్శనకు రూ.19.6 కోట్లు ఖర్చు చేశారు. ఈసందర్శనల ఉద్దేశ్యం క్వాడ్ సదస్సు, ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించడం. అమెరికా, యుఎఇ, జపాన్‌లలో ఒక్కో దేశాన్ని నాలుగు సార్లు సందర్శించారు. ఫ్రాన్స్‌ను మూడు సార్లు, బ్రిటన్, రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికాల్లో ఒక్కోదేశాన్ని రెండు సార్లు సందర్శించారు. దౌత్య సంబంధాల బలోపేతం కోసం ఈ పర్యటనలు చేసినట్లు ప్రధాని మోడీ పేర్కొన్నప్పటికీ.. దేశంలో ఓ వైపు ఇప్పటికీ ఆహారం, వసతి కోసం ఇబ్బందిపడుతుండటం గమనార్హం. ఈ సందర్శనల కోసం వినియోగించే ప్రభుత్వ వ్యయాన్ని ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికోసం ఖర్చు చేయాలని పలువురు మేథావులు, నిపుణులు పేర్కొంటున్నారు.విదేశీ ప్రయాణాల కోసం అత్యధదిక వ్యయంపై ప్రతిపక్షాలు గతంలో ప్రశ్నలు లేవనెత్తిన సంగతి తెలిసిందే.

## రైతుల ప్రయోజనాలపై మోడీ అబద్ధాలు

### వాణిజ్య ఒప్పందంపై పెద్ద ఎత్తున నిరసనలు - భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్


**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 12ప్రజావినికిడి,**
భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్ని గ్రామాలలో పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని భారతీయ కిసాన్ యూనియన్ బికెయు ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మలను తగలబెడతామని తెలిపింది. బికెయు నేత రాకేశ్ తికాయత్ న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల పరిరక్షణ గురించి మోడీ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. 1992లో భారత్ తన ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరిచి విదేశాలను అనుమతించిందని, ప్రస్తుత పరిస్థితి కూడా అలాగే ఉన్నదని ఆయన చెప్పారు. 'భారత్-అమెరికా ఒప్పందం జరిగిన తీరు చూస్తుంటే అది మన దేశానికి ప్రమాదకారిగా కన్పిస్తోంది. కాబట్టి దానిపై మనం గళం విప్పాల్సిందే' అని అన్నారు. ఇది ఏకపక్ష ఒప్పందమని, ఒత్తిడితో



కుదుర్చుకున్నదని తికాయత్ చెప్పారు. ఈ ఒప్పందం భారత రైతులకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. అమెరికా మన దేశంలోకి సబ్సిడీతో కూడిన వస్తువులను కుమ్మరిస్తుందని, ఫలితంగా మన రైతులు తమ ఉత్పత్తులను విక్రయించలేరని తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడతామంటూ ప్రభుత్వం ఇచ్చిన హామీని విలేకరులు ప్రస్తావించగా 'అది అబద్ధం చెబుతోంది. వారు ఏమైనా చెప్పుకోనివ్వండి. నిరసనలు తప్పవు' అని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మలను గ్రామాలలో రైతులు దగ్ధం చేస్తారని, ఈ నెల 12న జరిగే సార్వత్రిక సమ్మెకు మద్దతు తెలుపుతారని అన్నారు. 'మా ట్రాక్టర్లకు ఢిల్లీ ఎంతో దూరంలో లేదు. అవి సిద్ధంగానే ఉన్నాయి' అని వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందం భారత్‌కు న్యాయసమ్మతం కాదని ఆర్జేడీ ఎంపి సుధాకర్ సింగ్ చెప్పారు. ఇది ఉభయులకూ ప్రయోజనకరమైన ఒప్పందం కాదని, భారత్ 18 శాతం సుంకం కడుతుంటే అమెరికా మాత్రం సున్నా టారిఫ్‌కే పరిమితమవుతోందన్నారు. ప్రతిపాదిత విత్తన బిల్లును కూడా ఆయన వ్యతిరేకించారు. రైతులు అధిక ధరకు విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుందని తెలిపారు. అమ్‌ఆద్మీ పార్టీ ఎంపి సంజరు సింగ్, ఆల్ ఇండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ కూడా విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

## రెండేళ్ల తరవాత జాహ్నవికి భారీ పరిహారం

### పోలీస్ పెట్రోలింగ్ కారు ఢీకొని యువతి మృతి




**కర్నూలు,ఫిబ్రవరి 12ప్రజావినికిడి,**
అమెరికాలో ఓ బాద్యత గల పోలీసు అధికారి నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదంలో మరణించిన కర్నూలు యువతి కందుల జాహ్నవి(23) అనే యువతి కుటుంబానికి న్యాయం జరిగింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ అధికారిని విధులనుంచి తొలగించడంతో పాటు మృతురాలు కుటుంబానికి అక్కడి ప్రభుత్వం రూ.262 కోట్ల భారీ పరిహారాన్ని ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కర్నూలు జిల్లాకు చెందిన జాహ్నవి పై చదువుల కోసం అమెరికా వెళ్లింది. 2023 జనవరిలో సియాటెల్ నగరంలో రోడ్డు దాటుతున్న జాహ్నవిని పోలీస్ పెట్రోలింగ్ కారు ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో జాహ్నవి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదానికి కారణమైన డేనియల్ అదరర్ అనే పోలీసు అధికారి కనీసం బాధ్యతగా ప్రవర్తించక పోగా ఎగతాలిగా మాట్లాడారు. ఆమె చనిపోయింది, ఆమె చాలా మాములు మనిషి, 11 వేల డాలర్లు ఇస్తే సరిపోతుంది హహహ ' అంటూ ఎగతాలిగా మాట్లాడాడు. కారుతో ఢీకొట్టి కనీసం పాశ్చాతాపం లేకండా వెకిలిగా ప్రవర్తించిన అధికారిపై సియాటెల్ నగర యంత్రాంగ చర్యలు తీసుకంది

## కాన్పూర్‌లో పాదచారులపై లంబోర్ఘి కారు

### ఘటనలో వ్యాపారవేత్త కుమారుడి అరెస్ట్




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 12ప్రజావినికిడి,**ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పాదచారుల పైకి లంబోర్ఘిని కారు దూసుకెళ్లిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణమైన కారును నడిపిన ప్రముఖ పొగాకు వ్యాపారి కేకే మిశ్రా కుమారుడు శివంను తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత ఈ అరెస్టు చోటుచేసుకుంది. కాన్పూర్‌లోని వీఐపీ రోడ్‌లో ఆదివారం మధ్యాహ్నం వేగంగా వస్తున్న లంబోర్ఘిని కారు ఒక్కసారిగా అదుపుతప్పింది. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న పాదచారులు, వాహనాల పైకి అది దూసుకెళ్లింది. దీనికి ముందు ఈ లగ్జరీ కారు ఓ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ కారు నడిపింది శివం మిశ్రానే అని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ క్రమంలో గురువారం ఉదయం అతడిని అరెస్టు చేశారు. అతడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. బుధవారం ఈ కేసులో నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణమైన లంబోర్ఘిని కారును నడిపింది శివం కాదు.. తానే అంటూ మోహన్ అనే వ్యక్తి కాన్పూర్ కోర్టులో లొంగిపోవడానికి వచ్చాడు. ప్రమాదానికి కొన్ని క్షణాల ముందు శివం మూర్ఛపోయాడని.. అతడిని ఒక చేత్తో పట్టుకొని కారు నడిపానని వెల్లడించారు. ఈ క్రమంలో కారు ఓ ఆటోని ఢీకొట్టిందని, ఆ తర్వాత డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయిందని వెల్లడించాడు. ప్రమాదం జరిగిన వెంటనే ఆటో లాకింగ్ సిస్టమ్ వల్ల తాను బయటకు రాలేకపోయానని, శివంను డ్రైవర్ సీటులోకి మార్చి.. తాను మరో సీటులోకి వెళ్లినట్లు వివరించాడు. అయితే, ప్రమాద సమయంలో కారు నడిపింది శివం మిశ్రానే అని పోలీసులు నిర్ధరించారు. ఘటన అనంతరం అతడిని డ్రైవర్ సీటు నుంచి బయటకు తీసిన వీడియోలు కూడా వెలువడ్డాయి. పోలీసుల వాదనలను గమనించిన న్యాయస్థానం మోహన్ లొంగిపోవడాన్ని నిరాకరించింది. దీనిపై వివరణాత్మక నివేదిక ఇవ్వాలని పోలీసులను కోరింది. ఘటనా సమయంలో కారు నడుపుతున్నది తానేనని, మిశ్రా కాదని ఒక వ్యక్తి స్థానిక కోర్టుకు వెళ్లి బుధవారం లొంగిపోయారు. అయితే మిశ్రా వాహనం నడిపాడని నిరూపించడానికి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని పోలీసులు నిర్ధారించారు. కోర్టు ఎదుట లొంగిపోయేందుకు ఆయన పెట్టుకున్న అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. గురువారం ఉదయం పోలీసులు అతనిని అరెస్ట్ చేశారని, కోర్టు ఎదుట హాజరుపరుస్తారని పోలీస్ కమిషనర్ రఘుబీర్‌లాల్ తెలిపారు. మిశ్రాను ఢిల్లీలోని ఒక ఆస్పత్రి నుండి అదుపులోకి తీసుకున్నారని అన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన 18ఏళ్ల ఈ రిక్షా డ్రైవర్ మహ్మద్ తాఫీక్ ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు.

----------

# వరల్డ్‌కప్‌లో ఇటలీ తొలి విజయం



### - నేపాల్ పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం

ప్రపంచకప్‌లో పసికూన ఇటలీ సంచలనం సృష్టించింది. టీ20 వరల్డ్‌కప్ టోర్నమెంట్‌లో తొలి విజయం నమోదు చేసింది. తాజాగా ముంబయి వేదికగా నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. నేపాల్ నిర్దేశించిన 124 పరుగుల లక్ష్యాన్ని ఇటలీ 12.4 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా ఛేదించింది. ఓపెనర్లు జస్టిన్ మోస్కా (60 పరుగులు), ఆంథని మోస్కా (62 పరుగులు) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. దీంతో 44 బంతులు మిగిలుండగానే ఇటలీ విజయం సాధించింది.స్వల్ప లక్ష్య ఛేదనే అయినప్పటికీ నేపాల్ ఏదైనా అద్భుతం చేస్తుందేమోనని క్రికెట్ ఫ్యాన్స్ తొలుత భావించారు. అయితే ప్రత్యర్థి నేపాల్‌కు ఇటలీ ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. తొలి నుంచే ఎడాపెడా బౌండరీలు బాదేశారు. వీళ్లిద్దరి విధ్వంసంతో పవర్ ప్లేలోనే ఇటలీ వికెట్ నష్టపోకుండా 68 పరుగులు చేసింది. ఆ తర్వాత కూడా జోరు కొనసాగించిన ఓపెనర్లు చెరో హాఫ్ సెంచరీ కంప్లీట్ చేసుకున్నారు. ఈ క్రమంలోనే 10 ఓవర్లకు స్కోర్ 97కు చేరింది. ఇక 11, 12వ ఓవర్లో వరుసగా 14, 11 వచ్చాయి. ఆ తర్వాత 13వ ఓవర్లో రెండు సింగిల్స్ రావడంతో మ్యాచ్ ముగిసింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన నేపాల్ 19.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆరిఫ్ షేక్ (27 పరుగులు) టాప్ స్కోరర్. రోహిత్ పౌడెల్ (23 పరుగులు), ఆసిఫ్ షేక్ (20 పరుగులు) ఫర్వాలేదనిపించారు. గతమ్యాచ్‌లో మెరుపులు మెరిపించిన లోకేశ్ బమ్ (3 పరుగులు) తీవ్రంగా నిరాశపర్చాడు. చివర్లో కరణ్ కేసీ (18టి పరుగులు) బాదడంతో జట్టు స్కోర్ 120 దాటింది. ఇటలీ బౌలర్లలో క్రిషన్ 3, బెన్ 2, అలీ హసన్, జస్ప్రీత్ సింగ్, సమ్స్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఇదే టోర్నీలో రీసెంట్‌గా తొలి మ్యాచ్‌లో పటిష్ఠమైన ఇంగ్లాండ్‌ను ఓడించినంతపని చేసిన నేపాల్ ఈ మ్యాచ్‌లో కనీసం పోటీ ఇవ్వకపోవడం గమనార్హం. ఆ మ్యాచ్‌లో గెలుపు అంచులదాకా వెళ్లిన పసికూన నేపాల్, ఈసారి ఇటలీని చిత్తు చేస్తుందని మ్యాచ్‌కు ముందు అంతా అనుకున్నారు. కానీ సీన్స్ రివర్స్ అయ్యింది. తొలుత బ్యాటింగ్, తర్వాత బౌలింగ్ రెండు విభాగాల్లోనూ పూర్తిగా విఫలమై వరుసగా రెండో ఓటమి మూటగట్టుకుంది. ఇక ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన ఇటలీ రెండో మ్యాచ్‌తో టోర్నీలో బోణీ కొట్టింది. అలాగే టీ20 ప్రపంచకప్‌లో 100 పరుగుల భాగస్వామ్యం చేసిన మూడో అసోసియేటెడ్ (టెస్టు హోదా లేని జట్టు) జట్టుగా ఇటలీ అరుదైన ఘనత సాధించింది. గతంలో ఒమన్ (2021), స్కాట్లాండ్ (2026) ఈ ఘనత సాధించాయి. వరల్డ్‌కప్‌లో తొలి విజయం సాధించిన ఇటలీని క్రికెట్ దిగ్గజం సచిన్ తెండుల్కర్ అభినందించాడు. “టీ20 ప్రపంచకప్‌లో తొలి విజయం అందుకున్న ఇటలీకి శుభాకాంక్షలు. ఫుట్‌బాల్‌లో అత్యుత్తమ జట్టైన ఇటలీ క్రికెట్‌లోనూ తనదైన ముద్ర వేయడం, గ్లోబల్ లెవెల్‌కు వ్యాపిస్తుందని గుర్తుచేస్తుంది” అని సచిన్ ట్వీట్ చేశాడు.



## పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌కు అభిషేక్ శర్మ దూరం

టీ20 ప్రపంచ కప్ 2026 భారత్ తన రెండో మ్యాచ్ ఆడుతోంది. మొదటి మ్యాచ్‌లో అమెరికాపై విజయం సాధించింది. ఇప్పుడు రెండో మ్యాచ్ నమీబియాతో తలపడుతోంది. మొదటి మ్యాచ్‌లో తొలి బంతికే అవుట్ అయిన అభిషేక్ శర్మ ఆరోగ్యం ఇప్పుడు టీమిండియాను టెన్షన్ పెడుతోంది. అభిషేక్ కడుపు సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఇప్పుడు, నమీబియాతో జరిగే రెండో మ్యాచ్ కోసం అభిషేక్ ప్లేయింగ్ ఎలెవెన్‌లో చోటు దక్కలేదు. మ్యాచ్‌కు ముందు టాస్ సందర్భంగా, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అభిషేక్ శర్మ ఆరోగ్యం గురించి అప్‌డేట్ ఇచ్చాడు. సూర్య అప్‌డేట్ అభిమానులకు నిజంగా షాక్‌కి గురి చేసింది. పాకిస్తాన్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌కు అభిషేక్ కూడా దూరంగా ఉండవచ్చని అతను చెప్పడం ఆందోళనకలిగిస్తోంది. టాస్ తర్వాత అభిషేక్ ఆరోగ్యం గురించి అడిగిన ప్రశ్నకు సూర్యకుమార్ యాదవ్ స్పందిస్తూ, “అభిషేక్ ఇంకా బాగా లేదు. అతను ఒకటి లేదా రెండు మ్యాచ్‌లకు దూరమవుతాడు” అని అన్నారు. సూర్య ప్రకటన స్పష్టంగా అర్థం ఏమిటంటే, నమీబియా తర్వాత, పాకిస్తాన్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌కు కూడా అభిషేక్ దూరమవవచ్చు. భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ ఫిబ్రవరి 15 ఆదివారం శ్రీలంకలోని కొలంబోలో జరుగుతుంది. ఈ మ్యాచ్‌కు అభిషేక్ తిరిగి వస్తాడా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. టోర్నమెంట్‌లో భారత్ ప్రధాన ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ అభిషేక్ శర్మ. అతని స్థానంలో ఓపెనింగ్ వస్తున్న సంజూ శాంసన్ ఫామ్‌లో లేడు. ఆయన ధాటిగా ఆడటానికి పరుగులు చేయడానికి ఇబ్బంది పడుతున్నాడు. అయితే, అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ విఫలమయ్యాడు. ఖాతా తెరవకుండానే మొదటి బంతికే ఔటయ్యాడు. అయినప్పటికీ, పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో అభిషేక్ ఉండటం టీమ్ ఇండియాకు పెద్ద ప్రయోజనకరంగా ఉంటుంది.

## హార్దిక్ పాండ్యా రికార్డుకు గురిపెట్టిన వైభవ్ సూర్యవంశీ..



ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే క్రికెట్ అభిమానులకు అసలైన మజా ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ. ఒకప్పుడు హార్దిక్ పాండ్యా ఒకే ఇన్నింగ్స్‌లో 20 సిక్సర్లు బాది సృష్టించిన సునామీ గుర్తు ఉండే ఉంటుంది. ఇప్పుడు అదే టోర్నమెంట్‌లో ఈ చిచ్చరపిడుగు తన ప్రతాపం చూపించబోతున్నాడు. ఫిబ్రవరి 23 నుంచి ముంబైలో ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మక డీవై పాటిల్ టీ20 టోర్నమెంట్‌లో వైభవ్ ఆడటం దాదాపు ఖాయమైంది. డీవై పాటిల్ టీ20 టోర్నమెంట్ అంటేనే స్టార్ ప్లేయర్లకు అడ్డా. 2020లో గాయం నుంచి కోలుకున్న తర్వాత హార్దిక్ పాండ్యా ఇదే టోర్నీలో విశ్వరూపం చూపించాడు. కేవలం 55 బంతుల్లో 20 సిక్సర్లు, 6 ఫోర్లతో 158 పరుగులు చేసి క్రికెట్ లోకాన్ని ఆశ్చర్యపరిచాడు. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే రెండు సెంచరీలు బాదిన పాండ్యా, అప్పట్లో ఈ టోర్నీ స్థాయిని అమాంతం పెంచేశాడు. ఇప్పుడు అదే వేదికపై వైభవ్ సూర్యవంశీ తన సత్తా చాటబోతున్నాడు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ పేరు మార్మోగిపోవడానికి బలమైన కారణం ఉంది. ఇటీవల ముగిసిన అండర్-19 వరల్డ్ కప్ 2026 ఫైనల్లో కేవలం 80 బంతుల్లోనే 175 పరుగులు బాది సంచలనం సృష్టించాడు. ఈ ఏడాది ఇప్పటికే అండర్-19 క్రికెట్‌లో రెండు సెంచరీలు సాధించిన వైభవ్, ఇప్పుడు సీనియర్ ప్లేయర్లతో తలపడేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడనున్న వైభవ్, దానికి ముందు ఈ టోర్నీని ఒక వార్మప్ సెషన్‌గా భావిస్తున్నాడు. తాజా సమాచారం ప్రకారం.. వైభవ్ ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్ ఆధ్వర్యంలో తాళేగావ్‌లో జరుగుతున్న శిక్షణా శిబిరంలో ఉన్నాడు. ఈ క్యాంప్ ఫిబ్రవరి 21న ముగియనుంది. ఆ తర్వాత తన స్వస్థలానికి వెళ్లి, తిరిగి ముంబై చేరుకుని డీవై పాటిల్ టోర్నీలో పాల్గొంటాడు.

## భారత క్రికెటర్ల వాచ్‌ల విలువ కాదు పాక్ ఆటగాళ్ల నెట్‌వర్త్..

### • షోయబ్ అక్తర్ మాట్లాడినట్లు వైరల్‌గా మారిన ట్వీట్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్-పాకిస్థాన్ హైఓల్టేజ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఈ మ్యాచ్‌పై నెలకొన్న సందిగ్ధతకు ఐసీసీ తెరదించిన సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని ప్రకటించిన పాకిస్థాన్.. ఐసీసీ ఆంక్షలకు తలొగ్గి తమ నిర్ణయాన్ని మార్చుకుంది. భద్రతా కారణాలతో టీ20 ప్రపంచకప్ 2026 నుంచి తప్పుకున్న బంగ్లాదేశ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోమని ఐసీసీ హామీ ఇవ్వడంతో భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు పాకిస్థాన్ సిద్ధమైంది.భారత్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లను పునరుద్ధరించాలని ఈ సందర్భంగా పీసీబీ డిమాండ్ చేయగా.. ఐసీసీ తిరస్కరించింది. తమ పరిధిలో లేని వ్యవహారమని, బీసీసీఐని ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడమని ఆదేశించలేమని స్పష్టం చేసింది. మిత్ర దేశాల విజ్ఞప్తుల నేపథ్యంలో బాయ్‌కట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ఒక ప్రకటనను విడుదల చేసింది.దాంతో ఆదివారం(ఫిబ్రవరి 15) కొలంబో వేదికగా భారత్-పాకిస్థాన్ మ్యాచ్ జరగనుంది. పాకిస్థాన్ బాయ్‌కాట్ డ్రామా నేపథ్యంలో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కొలంబో పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉండటం.. పాకిస్థాన్‌లో ఐదుగురు స్పిన్నర్లు ఉండటం ఈ మ్యాచ్‌పై హైప్‌ను క్రియేట్ చేస్తోంది. ముఖ్యంగా మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారీక్ అద్భుత ప్రదర్శన కనబరుస్తుండటంతో భారత్‌కు గట్టి పోటీ ఎదురవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ఈ మ్యాచ్‌పై సోషల్ మీడియా వేదికగా జోరుగా చర్చ జరుగుతోంది.అయితే ఈ చర్చ మధ్యలో కొన్ని ఫేక్ ట్వీట్స్, కామెంట్స్ కూడా నెటిజన్లను అయోమయానికి గురి చేస్తున్నాయి. భారత్‌తో పాకిస్థాన్ జట్టును పోల్చడం సరికాదని, భారత ఆటగాళ్ల వాచీల ధర అంత కూడా పాక్ ఆటగాళ్ల సంపాదన ఉండదని షోయబ్ అక్తర్ మాట్లాడినట్లు ఓ ఫేక్ ట్వీట్ వైరల్‌గా మారింది.భారత ఆటగాళ్లతో పాకిస్థాన్ ప్లేయర్లను అస్సలు పోల్చలేరు. మా క్రికెటర్ల నెట్‌వర్త్ భారత ఆటగాళ్లు వాడే ఖరీదైన వాచులతో సమానం.’అని షోయబ్ అక్తర్.. ఓ ప్రముఖ భారత న్యూస్ ఛానెల్‌తో అన్నట్లు ఓ ఫేక్ ట్వీట్ వైరల్‌గా మారింది. అయితే ఇందులో ఏ మాత్రం నిజం లేదు. ఈ కామెంట్స్‌ను అక్తర్ ఎక్కడా అనలేదు. పాకిస్థాన్‌పై ఉన్న కోపంతో ఓ భారత నెటిజన్ క్రియేట్ చేసిన పోస్ట్ అని ఈ విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఎక్స్ ఏఐ చాట్‌బాట్ గ్రోక్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ఇది నకిలీ పోస్ట్ అని తేల్చింది. మెగా టోర్నీల్లో పాకిస్థాన్‌పై భారత్‌దే పైచేయిగా ఉంది. ఆసియా కప్ 2025 టోర్నీలో మూడు మ్యాచ్‌లకు మూడింటిలోనూ భారత్‌పై పాకిస్థాన్ ఓటమిపాలైంది.



## సూపర్-8 రేసులో వెనుకబడ్డ ఇంగ్లాండ్

టీ20 వరల్డ్ కప్ 2026 రసవత్తరంగా సాగుతోంది. ప్రతి మ్యాచ్ తర్వాత పాయింట్ల పట్టిక తలకిందులవుతోంది. ఫిబ్రవరి 11న జరిగిన కీలక పోరులో వెస్టిండీస్ చేతిలో ఇంగ్లాండ్ ఓడిపోవడంతో సూపర్-8 ఈక్వేషన్స్ పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు డిఫెండింగ్ ఛాంపియన్లుగా వెలిగిన ఇంగ్లాండ్ టీమ్, ఇప్పుడు తదుపరి రౌండ్‌కు చేరుతుందా లేదా అన్న ఆందోళనలో పడిపోయింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఉత్కంఠ పోరులో వెస్టిండీస్ 30 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసింది. దీంతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన వెస్టిండీస్ 4 పాయింట్లతో గ్రూప్-సిలో అగ్రస్థానంలో నిలిచింది. ఇంగ్లాండ్ పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఒకటి గెలిచి, ఒకటి ఓడిపోయినప్పటికీ.. రన్ రేట్ తక్కువగా ఉండటంతో స్కాట్లాండ్ కంటే వెనుకబడి మూడో స్థానంలో ఉంది.



## 6,6,6,6,6.. 20 బంతుల్లో ఇషాన్ బీభత్సం..

టాస్ ఓడిపోయి బ్యాటింగ్ ప్రారంభించిన భారత్, తొలి ఆరు ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 86 పరుగులు చేసింది. తుఫాన్ ఆరంభంతో నమీబియాపై చెలరేగిపోయారు టీమిండియా బ్యాటర్లు. ఈ క్రమంలో ఇషాన్ కిషన్ మరోసారి తన బ్యాట్ ఝులిపించాడు. కేవలం 20 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఇందులో 5 సిక్స్‌లు, 6 ఫోర్లు ఉన్నాయి. ధాటిగే ఆడే క్రమంలో ఓ భారీ షాక్ ఆడబోయి 61 పరుగులకు పెవిలియన్ చేరాడు. పవర్ ప్లే చివరి ఓవర్లో ఇషాన్ వరుసగా నాలుగు సిక్సర్లు, ఒక ఫోర్ కొట్టి తన అర్ధ సెంచరీని చేరుకున్నాడు. శాంసన్ 22 పరుగుల వద్ద ఔటయ్యాడు. ఈ క్రమంలో ఇషాన్‌తోపాటు టీమిండియా పేరిట కొన్ని రికార్డులు నమోదయ్యాయి.



# యువతరానికి కనెక్ట్ అయ్యే హుషారు పిట్టలు



టాలీవుడ్ యువ నటులు అన్ను, వాసవి గణెళిషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సురేష్ ఫిలింస్ విడుదల చేస్తుండగా. ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ.. నిర్మాత బెక్కం వేణుగోపాల్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసిందని, సినిమా చూడగానే ఇది నేటి యువతరానికి బాగా కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ మూవీ అనిపించిందని ప్రశంసించారు. చిత్రంలోని నటీనటులందరూ అద్భుతంగా నటించారని, ప్రేక్షకులకు ఈ సినిమా తప్పకుండా నచ్చుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. 16 ఏళ్ల కష్టానికి ప్రతిఫలంగా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉందన్నారు. తన నిజజీవితంలో చుట్టుపక్కల జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా, యువతతో పాటు తల్లిదండ్రులు కూడా చూడాల్సిన ఒక బాధ్యతాయుతమైన కథను వినోదాత్మక శైలిలో రూపొందించానని తెలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ వంటి పెద్ద సంస్థ ద్వారా సినిమా విడుదల కావడం తన అదృష్టమని పేర్కొన్నారు.నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ సినిమా చూసినప్పుడు తనకు షాకింగ్‌గా అనిపించిందని, ప్రథమార్థం యూత్‌ఫుల్‌గా ఉంటూనే ద్వితీయార్థంలో ఎంతో మెచ్యూర్డ్ కంటెంట్ ఉంటుందని చెప్పారు. కంటెంట్ నచ్చడం వల్లే సురేష్ బాబు ఈ సినిమాను సపోర్ట్ చేస్తున్నారని, ఇది అందరిలో బాధ్యతను పెంచే చిత్రమని తెలిపారు.హీరో అన్ను తాను మాసినపల్లి రవి పాత్రలో కనిపిస్తానని చెప్పగా, హీరోయిన్ వాసవి గణెళిషన్ తన తొలి చిత్రంలోని పాత్ర అందరికీ నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు చిన్ని చరణ్ మాట్లాడుతూ, ఈ సినిమా తనను మాస్ కమర్షియల్ మ్యూజిక్ డైరెక్టర్‌గా నిలబెడుతుందని ధీమా వ్యక్తం చేశారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ, ఏడేళ్ల అనుభవంతో, కథపై నమ్మకంతో ఈ సినిమాను నిజాయితీగా నిర్మించామని, యువతకు మంచి సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. అన్ను, వాసవి గణెళిషన్‌తో పాటు గోవర్ధన్, సునీత్ మనోహర్, రమేష్, బలగం బాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి చరణ్-అర్జున్ సంగీతాన్ని అందించారు.



# 'యుఫోరియా'పై మహేశ్ బాబు ప్రశంసలు... క్లైమాక్స్ అద్భుతమన్న సూపర్ స్టార్

సూపర్‌స్టార్ మహేశ్ బాబు, దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'యుఫోరియా'పై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ సినిమాను వీక్షించిన ఆయన, తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది."గుణశేఖర్ గారు కథలను చెప్పే విధానంలో ఒక ప్రత్యేకమైన శైలి ఉంటుంది. సినిమాను నేను బాగా ఆస్వాదించాను, ముఖ్యంగా క్లైమాక్స్ అద్భుతంగా ఉంది. ఇది తప్పక చూడాల్సిన సినిమా" అని మహేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. దర్శకుడు గుణశేఖర్‌తో పాటు నటి భూమికా చావ్లా, నిర్మాతలు నీలిమ గుణ, యుక్త గుణ, సంగీత దర్శకుడు కాల భైరవ, నటి సారా అర్జున్ సహా మొత్తం చిత్ర బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక అంశాలతో కూడిన డ్రామా థ్రిల్లర్‌గా 'యుఫోరియా' తెరకెక్కింది. యువత ఎదుర్కొంటున్న డ్రగ్స్, నేరాలు, కుటుంబ సమస్యల వంటి సున్నితమైన అంశాలను ఈ చిత్రంలో చర్చించారు. భూమికా చావ్లా, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న థియేటర్లలో విడుదలైంది. ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి స్పందన లభిస్తోంది.మహేశ్ బాబు కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన 'ఒక్కడు' చిత్రానికి గుణశేఖర్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. వీరిద్దరి మధ్య మంచి స్నేహబంధం ఉంది. ఈ నేపథ్యంలో మహేశ్ నుంచి వచ్చిన ప్రశంసలు 'యుఫోరియా' చిత్ర బృందంలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

# వెంకీ అట్లూరితో నాని మూవీకి ప్లాన్

స్టార్ కథానాయకుడు నాని ప్రస్తుతం వరుస హిట్లతో జోష్ మీద ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ది ప్యారడైజ్ సినిమాతో బిజీగా ఉన్న నాని ఆ తర్వాత సుజిత్ దర్శకత్వంలో ఒక సినిమా చేయబోతున్నాడు. అయితే ఈ రెండు చిత్రాలు కాకుండా మరో క్రేజీ దర్శకుడితో నాని చేతులు కలపబోతున్నట్లు తెలుస్తుంది. 'సార్', 'లక్కీ భాస్కర్' వంటి వైవిధ్యమైన చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు వెంకీ అట్లూరితో నాని సినిమా చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మించబోతున్నాడు. 'జెర్సీ' వంటి నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమా తర్వాత నాని ? సితార కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు త్వరలోనే చిత్రబృందం వెల్లడించనుంది. ప్రస్తుతం నాని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం మార్చి 26, 2026న విడుదలయ్యే అవకాశం ఉంది. దీని తర్వాత సుజీత్ దర్శకత్వంలో మరో సినిమా చేయనున్నారు. మరోవైపు వెంకీ అట్లూరి ప్రస్తుతం సూర్య హీరోగా 'విశ్వనాథన్ అండ్ సన్స్'చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈ కమిట్‌మెంట్లు అన్నీ పూర్తయిన తర్వాత, 2026 ద్వితీయార్థంలో నాని ? వెంకీ అట్లూరి ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

----------






# సుహాస్ వైవిధ్యంగా హే భగవాన్

వైవిధ్యమైన కథలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో సుహాస్, తాజాగా 'హే భగవాన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సీనియర్ నటుడు నరేష్ తన కుటుంబ వ్యాపారాన్ని రహస్యంగా నిర్వహిస్తుంటారు. ఆ వ్యాపారం ఏంటో ఎవరికీ చెప్పకూడదనే నిబంధన ఉంటుంది. అయితే తన తండ్రి వ్యాపారాన్ని సుహాస్ టేకోవర్ చేద్దామనుకుంటాడు. ఈ క్రమంలో ఎదురయ్యే సంఘటనలు ఏంటి అనేది ఈ చిత్ర కథాంశం.

'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' తర్వాత సుహాస్ మరియు శివానీ నాగారం మరోసారి జోడీ కట్టడం ఈ సినిమాపై అంచనాలను పెంచుతోంది. దర్శకుడు గోపీ అచ్చర ఈ చిత్రాన్ని అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించడమే కాకుండా, ÷-లకైమాక్స్‌లో ఒక మంచి ఎమోషనల్ టచ్ కూడా ఉంటుందని తెలిపారు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను త్రిశూల్ విజనరీ స్టూడియోస్ నిర్మించగా, బన్నీ వాస్ మరియు వంశీ నందిపాటి సంయుక్తంగా విడుదల చేస్తున్నారు.

# అప్పలసూరిగా జగపతిబాబు

ఒకప్పటి ఫ్యామిలీ హీరో, ప్రస్తుతం స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా దూసుకుపోతున్న జగపతి బాబు తాజాగా తన లుక్‌తో అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా కోసం ఆయన పూర్తిగా మారిపోయిన కొత్త రూపం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోను చూసిన నెటిజన్లు ఇతను జగపతి బాబా అంటున్నారు. ఈ చిత్రంలో జగపతి బాబు 'అప్పల సూరి' అనే కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఆ పాత్ర కోసం ఆయన బాగా బరువు తగ్గి, వయసు ముదిరిన వ్యక్తిలా కనిపించేలా ప్రత్యేక మేకోవర్ తీసుకున్నట్టు తెలుస్తోంది. తాజాగా విడుదలైన సెట్స్ ఫోటోలో దర్శకుడు బుచ్చిబాబుతో మాట్లాడుతున్న జగపతి బాబు రూపం చూసి అభిమానులు షాక్ అవుతున్నారు.




# బాలీవుడ్‌లో బెదిరింపుల కలకలం..

## రణ్‌వీర్, ఆయుష్ శర్మలకు హెచ్చరికలు

బాలీవుడ్‌లో మరోసారి బెదిరింపుల కలకలం రేగింది. ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్‌తో పాటు, సల్మాన్ ఖాన్ బావమరిది, నటుడు ఆయుష్ శర్మలకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు అందాయి. కోట్లాది రూపాయలు డిమాండ్ చేస్తూ వచ్చిన ఈ హెచ్చరికలతో సినీ పరిశ్రమ ఉలిక్కిపడింది. ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఈ ఘటనలపై దర్యాప్తును ముమ్మరం చేశారు.రణ్‌వీర్ సింగ్‌కు చెందిన ఒక ఉద్యోగి వాట్సాప్‌కు వాయిస్ నోట్ రూపంలో బెదిరింపు సందేశం వచ్చింది. నిందితులు తమ ఆచూకీ తెలియకుండా ఉండేందుకు వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (వీపీఎన్) వాడినట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు, ఆయుష్ శర్మకు అత్యంత గోప్యత కలిగిన ప్రోటాన్‌మెయిల్ ద్వారా బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. క్రిప్టోకరెన్సీ రూపంలో పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించాలని అందులో డిమాండ్ చేశారు. ఈ ఘటనల నేపథ్యంలో రణ్‌వీర్ సింగ్ ఇంటి వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.ఇటీవల దర్శకుడు రోహిత్ శెట్టి ఇంటి వద్ద జరిగిన కాల్పుల ఘటన తర్వాత బాలీవుడ్ ప్రముఖులే లక్ష్యంగా ఈ బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తోంది. రోహిత్ శెట్టి కేసులో ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేసి, వారిపై కఠినమైన 'మకోకా' చట్టాన్ని ప్రయోగించారు. ఈ దాడుల వెనుక లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్, దాని అనుచరుడు శుభమ్ లొంకర్ హస్తం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.ఈ వరుస ఘటనలతో సినీ పరిశ్రమలో భయాందోళనలు నెలకొన్నాయని ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ ఆవేదన వ్యక్తం చేసింది. మరోవైపు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందిస్తూ "ముంబైలో ఏ గ్యాంగ్‌ను కూడా స్థిరపడనీయం. బెదిరింపులకు పాల్పడిన వారిని పోలీసులు వేటాడి పట్టుకుంటారు" అని హామీ ఇచ్చారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613